



# అక్షరకలం
తెలుగు దినపత్రిక
epaper. aksharakalam. com
aksharakalam@gmail.com





సంపుటి : 17 సంచిక : 171 | 30-07-2025 బుధవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

- ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం
- 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్
- మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్

రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని, అలాగే పూడిక తీస్తామని , రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు.



వార్త 2లో

## ఆ 22 మంది చిన్నారుల బాధ్యత స్వీకరించిన రాహుల్ గాంధీ

- ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు
- తల్లిదండ్రులు, కుటుంబాలను కోల్పోయిన చిన్నారులు
- ఇటీవల సరిహద్దు గ్రామాల్లో పర్యటించిన రాహుల్ గాంధీ
- అనాథలుగా మారిన చిన్నారుల జాబితా ఇవ్వాలని కాంగ్రెస్ నేతలకు ఆదేశం

వివరాలు 2లో



## బీసీ బిల్లు సాధన కోసం మూడు రోజుల దీక్ష

- ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటలు దీక్ష చేస్తానన్న కవిత
- ఈ బిల్లు దేశానికి ఎంత అవసరమో చాటి చెప్పేందుకు దీక్ష అంటూ ప్రకటన
- బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష



వార్త 2లో

## ప్రధాని మోదీపై విరుచుకుపడిన సోనియాగాంధీ

- 'దైనిక్ జాగరణ్'కు వ్యాసం రాసిన సోనియాగాంధీ
- గాజా సంక్షోభంపై మోదీ మౌనాన్ని తప్పుబట్టిన సోనియా
- రాజ్యాంగ విలువలకు ద్రోహం చేస్తున్నారని మండిపాటు

వార్త 2లో



## పార్లమెంట్‌లో 'ఆపరేషన్ సిందూర్' రచ్చ..

సహనం కోల్పోయిన అమిత్ షా

జై శంకర్ ప్రసంగాన్ని పదేపదే అడ్డుకున్న విపక్షాలు

విపక్షాలు విదేశీ వాదనలను నమ్ముతున్నాయని అమిత్ షా ఎద్దేవా

ఇలాగే అయితే వారు మరో 20 సంవత్సరాలు ప్రతిపక్షానికే పరిమితమవుతారనిహెచ్చరిక



వార్త 2లో

## బీసీసీఐ కార్యాలయం నుంచి రూ. 6.5 లక్షల విలువ చేసే ఐపీఎల్ జెర్సీలు చోరీ

బీసీసీఐ కార్యాలయం నుంచి రూ. 6.5 లక్షల విలువైన ఐపీఎల్ జెర్సీలు చోరీకి గురయ్యాయి. ముంబైలోని వాంఖేడే స్టేడియంలో ఉన్న బీసీసీఐ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. ఈ చోరీకి పాల్పడిన వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పనిచేసే ఫరూఖ్ అస్లాం ఖాన్ అని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారని సమాచారం. ఒక్కో జెర్సీ ఖరీదు రూ. 2,500 ఉంటుందని అంచనా.పోలీసుల విచారణలో నిందితుడు జూదానికి బానిసై ఈ చోరీకి పాల్పడినట్లు తేలింది. ఈ జెర్సీలు వేర్వేరు జట్లకు చెందినవి. అయితే, అవి ఆటగాళ్ల కోసమా లేదా అభిమానుల కోసమా అనే విషయం తెలియాల్సి ఉంది. నిందితుడు దొంగిలించిన జెర్సీలను హర్యానాకు చెందిన ఓ ఆన్‌లైన్ డీలర్‌కు విక్రయించినట్లు పోలీసులు నిర్ధారించారు.ఈ దొంగతనం గత నెల 13న జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టోర్ రూంలో స్టాక్ మిస్ అయినట్లు ఆడిట్‌లో తేలడంతో చోరీ విషయం బయటపడింది. బీసీసీఐ అధికారులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో అసలు విషయం వెలుగు లోకి వచ్చింది.

# ఆ 22 మంది చిన్నారుల బాధ్యత స్వీకరించిన రాహుల్ గాంధీ

**ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు**

**తల్లిదండ్రులు, కుటుంబాలను కోల్పోయిన చిన్నారులు**

**ఇటీవల సరిహద్దు గ్రామాల్లో పర్యటించిన రాహుల్ గాంధీ**

**అనాథలుగా మారిన చిన్నారుల జాబితా ఇవ్వాలని కాంగ్రెస్ నేతలకు ఆదేశం**

అక్షరకలం ప్రతినిధి హైద్రాబాద్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెద్ద మనసు చాటుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతల కారణంగా అనాథలుగా మారిన 22 మంది చిన్నారుల ఆలన పాలన స్వీకరించేందుకు రాహుల్ గాంధీ ముందుకొచ్చారు. ఈ 22 మంది చిన్నారులు జమ్ము కశ్మీర్ లోని పూంఛ్ జిల్లాకు చెందినవారు. రాహుల్ గాంధీ ఇటీవల సరిహద్దు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా, పూంఛ్ ప్రాంతంలో తల్లిదండ్రులను, కుటుంబాలను కోల్పోయిన చిన్నారుల జాబితాను తనకు ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో, జమ్ము కశ్మీర్ కాంగ్రెస్ చీఫ్ హమీద్ 22 మంది చిన్నారులతో కూడిన జాబితాను రూపొం దించి రాహుల్ గాంధీకి అందజేశారు. ఇక ఆ చిన్నారుల బాధ్యతను రాహుల్ గాంధీయే చూసుకుంటారని, వారికి గ్రాడ్యుయేషన్ వరకు విద్య, వైద్యం, ఇతర ఖర్చులన్నీ రాహుల్ భరిస్తారని హమీద్ వివరించారు. త్వరలోనే ఈ చిన్నారులకు తొలి విడత సాయం అందజేస్తామని చెప్పారు.

# బీసీ బిల్లు సాధన కోసం మూడు రోజుల దీక్ష

**ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటలు దీక్ష చేస్తానన్న కవిత**

**ఈ బిల్లు దేశానికి ఎంత అవసరమో చాటి చెప్పేందుకు దీక్ష అంటూ ప్రకటన**

**బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష**

అక్షరకలం ప్రతినిధి హైద్రాబాద్

బీసీ బిల్లు సాధన కోసం 72 గంటలు దీక్ష చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. ఈ బిల్లు దేశానికి ఎంత అవసరమో చాటి చెప్పేందుకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటలు దీక్ష చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఈ రోజు హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష చేయనున్నట్టు చెప్పారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అన్ని పార్టీలతో వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో తలపెట్టిన ధర్నాను కేవలం బీహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న డ్రామాగా ఆమె పేర్కొన్నారు. అటు, బీజేపీ నేతలు బీసీలకు అండగా ఉండాల్సిన సమయంలో తప్పించుకుని తిరుగుతున్నారని కవిత దుయ్యబట్టారు.

# ప్రధాని మోదీపై విరుచుకుపడిన సోనియాగాంధీ

**'దైనిక్ జాగరణ్'కు వ్యాసం రాసిన సోనియాగాంధీ**

**గాజా సంక్షోభంపై మోదీ మౌనాన్ని తప్పుబట్టిన సోనియా**

**రాజ్యాంగ విలువలకు ద్రోహం చేస్తున్నారని మండిపాటు**

అక్షరకలం ప్రతినిధి హైద్రాబాద్

గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సంక్షోభంపై 'నీచమైన మౌనం' వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. గాజా ప్రజలకు మద్దతుగా భారతదేశం 'స్పష్టమైన, ధైర్యవంతమైన' వైఖరిని తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సోమవారం దైనిక్ జాగరణ్‌లో ప్రచురితమైన ఆమె వ్యాసంలో ఈ మేరకు పేర్కొన్నారు.'గాజా సంకట్ పర్ మూక్‌దర్శక్ మోదీ సర్కార్' (గాజా సంక్షోభంపై మౌనంగా ఉన్న మోదీ సర్కార్) అనే శీర్షికతో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియా గాంధీ ఇజ్రాయెల్ చర్యలను 'బార్బరిక్' (అనాగరికం), 'జెనోసైడ్' (మారణహోమం)గా అభివర్ణించారు. గాజాలో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ విధించిన సైనిక నిర్బంధం, ఔషధాలు, ఆహారం, ఇంధన సరఫరాను క్రూరంగా నిరోధించడం 'మానవత్వానికి వ్యతిరేకమైన నేరం' అని ఆమె ఆరోపించారు. గాజా సంక్షోభంపై ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడం 'రాజ్యాంగ విలువలకు ద్రోహం' అని ఆమె తీవ్రంగా విమర్శించారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడులు, ఇజ్రాయెలీ బందీలపై కొనసాగిస్తున్న చర్యలను తాను ఏమీ సమర్థించబోనని సోనియా స్పష్టం చేశారు. అయితే, ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజా పౌరులపై చేపట్టిన ప్రతీకార చర్యలు 'అత్యంత దారుణమైనవి, నేరపూరితమైనవి' అని ఆమె ఆరోపించారు. గత రెండేళ్లలో గాజాలో 55,000 మంది పౌరులు, అందులో 17,000 మంది పిల్లలు మరణించారని, చాలా వరకు నివాస భవనాలు ధ్వంసమయ్యాయని, గాజా సామాజిక వ్యవస్థ పూర్తిగా శిథిలమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**భారతదేశ చారిత్రక వైఖరి**

1974లో ఇందిరా గాంధీ నాయకత్వంలో పాలస్తీన్ లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్‌వో)ను పాలస్తీనియన్ ప్రజల ఏకైక చట్టబద్ధమైన ప్రతినిధిగా గుర్తించిన మొదటి అరబ్ యేతర దేశంగా భారత్ నిలిచిందని సోనియా గుర్తు చేశారు. 1988లో పాలస్తీన్ దేశాన్ని అధికారికంగా గుర్తించిన మొదటి దేశాలలో భారతదేశం ఒకటని ఆమె పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు మరోసారి భారతదేశం నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నాయని, మోదీ 'స్పష్టంగా, ధైర్యంగా, సూటిగా' మాట్లాడాలని సోనియా కోరారు.

# పార్లమెంట్‌లో 'ఆపరేషన్ సిందూర్' రచ్చ..

**సహనం కోల్పోయిన అమిత్ షా**

**జై శంకర్ ప్రసంగాన్ని పదేపదే అడ్డుకున్న విపక్షాలు**

**విపక్షాలు విదేశీ వాదనలను నమ్ముతున్నాయని అమిత్ షా ఎద్దేవా**

ఇలాగే అయితే వారు మరో 20 సంవత్సరాలు ప్రతిపక్షానికే పరిమితమవుతారనిహెచ్చరిక లోక్‌సభలో 'ఆపరేషన్ సిందూర్'పై జరిగిన చర్చ తీవ్ర రచ్చకు దారితీసింది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను విపక్షాలు పదేపదే అడ్డుకోవడంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహనం కోల్పోయారు. విపక్షాలు దేశ విదేశాంగ మంత్రిని నమ్మకుండా, విదేశీ వాదనలను నమ్ముతున్నాయని తీవ్రంగా విమర్శించారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కాల్పుల విరమణ వాదనలను జైశంకర్ ఖండించారు. మోదీ, ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలను విపక్షాలు అడ్డుకోవడంతో అమిత్ షా సభలో జోక్యం చేసుకొని విపక్షాలపై విరుచుకుపడ్డారు. "విపక్షాలు తమ దేశ విదేశాంగ మంత్రిని నమ్మకుండా, ఇతర దేశాలపై నమ్మకం ఉంచడం ఆక్షేపణీయం. వారి పార్టీలో విదేశీ ప్రాముఖ్యతను నేను అర్థం చేసుకోగలను. కానీ దానిని ఈ సభపై రుద్దడం సరికాదు. అందుకే వారు ఈ రోజు విపక్ష బెంచీలపై ఉన్నారు. రాబోయే 20 సంవత్సరాలు వారు అక్కడే ఉంటారు" అని అమిత్ షా ఘాటుగా విమర్శించారు. విపక్షాలు అడ్డుకోవడం కొనసాగి ంచడంతో షా మరోసారి జోక్యం చేసుకున్నారు "వారి నాయకులు మాట్లాడినప్పుడు మేం ఓపికగా విన్నాం. రేపు నేను వారు చెప్పిన అబద్ధాలను జాబితా చేస్తాను. ఇప్పుడు వారు సత్యాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంత ముఖ్యమైన అంశంపై హెచ్చరించారు.


# రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

**ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం**

**26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్**

**మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్**

నాగార్జునసాగర్, అక్షరకలం ప్రతినిధి



రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని, అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు. సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహుదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు- వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు.తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు- అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు. సాగునీటితో పాటు- నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటిని తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ కు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు.మంగళవారం సాయంత్రం వరకు 20 గేట్ల ద్వారా 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలనున్నట్లు- ప్రాజక్ట్ అధికారులు తెలిపారు. అనంతరం మంత్రులు,అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు.













# భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

## పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ

## ఫిర్యాదుదారుకు కోర్టు దజక్రణ కింద నోటీసులు

న్యూఢిల్లీ,

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హైకోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించారు. ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధింన అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు- సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు-, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ- స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిష్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు- ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితేష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితేష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

# ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా

## ఉగ్రమూకలను అణచివేస్తే సంతోషించరా

## మాజీ హోంమంత్రికి ఉగ్రవాదుల ఉనికిపై అనుమానాలా


## లోక్‌సభలో సిందూర్

## అమిత్ షా ప్రసంగం

## చిందబరం వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్

## ముగ్గురు పహల్గా ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి

న్యూఢిల్లీ



పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారణంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై విపక్షాలు సంతోషం వ్యక్తం చేస్తాయనుకుంటే.. సందేహాలు వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిషా మాట్లాడారు. విపక్ష ఎంపీల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టు-బెడితే ఆనందం వ్యక్తం చేస్తారనుకున్నానని.. కానీ విపక్ష సభ్యులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచించాలంటూ హితవుపలికారు. ఉగ్రవాదులు చనిపోయారన్న సంతోషం వారిలో కనిపించలేదని చెప్పారు. ఉగ్రవాదులు పాక్ నుంచే వచ్చారనేందుకు.. ఆధారాలు ఉన్నాయా అన్న చిదంబరం ప్రశ్నకు అమిత్ షా స్పందించారు. పాక్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. పాక్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాల్సిన అవసరం ఏంటంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని హితవు పలికారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల నుంచి కొన్ని పాక్ వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామని అమిత్‌షా క్లారిటీ ఇచ్చారు.

ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు. పహల్గాంలో పర్యాటకులను హత్య చేశారు. టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు ముందే కాల్చి చంపారు. మంతం, పేరు అడిగి మరీ చంపడం దారుణం. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని హతమార్చాం. ఈనెల 22న శాటిలైట్ ఫోన్ సిగ్నల్ ద్వారా ఉగ్రవాదుల కదలికలను గుర్తించాం. ఆపరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రదాడి జరిగిన రోజునే జమ్ము భద్రతపై సమీక్షించాం. ఉగ్రవాదులను ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేశాం. ఉగ్రశిబిరాలను మట్టిలో కలిపేశాం. ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులకు అభినందనలు' అని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల్ని హతమార్చాం అంటే విపక్షాలు సంతోషిస్తాయనుకున్నానని, కానీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారంటూ షా వ్యాఖ్యానించారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో ఉన్న హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్టు- నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో గడిచిన నెలరోజులుగా ఆ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. లష్కరే, జైషే ఉగ్రవాదుల కదలికల కోసం గడిచిన 14 రోజులుగా మరింత ముమ్మరంగా నిఘాను పెంచాయి. ఈ క్రమంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో రెండు రోజుల కిందట అనుమానస్పద కమ్యూనికేషన్లను భారత సైన్యం పసిగట్టింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించిన భద్రతాదళాలు.. మెరుపు వేగంతో కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఉగ్రవాది సులేమాన్ షాతో పాటు- పహల్గాం దాడికి కారణమైన మరో ఉగ్రవాది యాసిర్ హతమైనట్టు- అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఉగ్రవాది అబూ హామ్‌జా కూడా హతమైనట్టు- పేర్కొన్నారు. వీరందరూ విదేశీ ఉగ్రవాదులేనని

తెలిపారు. అమాయక పౌరులపై దాడులు చేస్తే మా ప్రతి స్పందన గట్టిగా ఉంటుందని హెచ్చరించారు. విపక్ష ఎంపిల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. పహల్గాం దాడి బాధితులను కలిసి వారి బాధలు తెలుసుకున్నామని, పహల్గాం దాడి ఘటనను వెంటనే ఎన్ఐఎకు అప్పగించామని వివరించారు. ఉగ్రవాదులు పాక్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ఉగ్రవాదుల నుంచి పాక్‌లో తయారైన పత్రాలు, చాక్లెట్లు- స్వాధీనం చేసుకున్నామని, కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం తగదని అమిత్ షా చురకలంటించారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు గమనించి కాంగ్రెస్ నేతలు మాట్లాడాలని సూచించారు.

ఆపరేషన్ సింధూర్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరంగా చెప్పారని, పహల్గాం తీవ్రవాదుల దాడిలో 26 మంది మృతి చెందారని, మృతుల్లో నేపాల్ వ్యక్తి కూడా ఉన్నారని తెలియజేశారు. పహల్గాం దాడి కేవలం పర్యాటకులపై కాదు అని, దేశంపై దాడి పరిగణించాలని, పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులను మట్టిలో కలిపేశామని, ఆనాడు 140 కోట్ల మంది ప్రజల గుండెచప్పుడును ప్రధాని మోడీ వివరించారని అమిత్ షా గుర్తు చేశారు. పాక్‌పై దాడులు చేసేందుకు భద్రతాబలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, మే 7న ఆపరేషన్ సింధూర్ చేపట్టామని, 9న ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేశామని, మన భద్రతా దళాల దాడుల్లో ఒక్క పాక్ పౌరుడు కూడా మరణించలేదన్నారు. పాక్‌లో వందల కిలో మీటర్ల లోపలికి వెళ్లి ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. భద్రతా దళాల దాడుల్లో పలువురు ఉగ్రవాద నేతలు కూడా హతమయ్యారని వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని, పాకిస్థాన్ దాడుల్లో ఇక్కడి గురుద్వారా, దేవాలయం ధ్వంసమయ్యాయని హోంశాఖ మంత్రి తెలియజేశారు.

# నిండుకుండలా నాగార్జున సాగర్

## 14 గేట్లు ఎత్తి నీటిని విడదల చేసిన మంత్రులు

## 18 ఏళ్ల తరవాత జూలైలో ఈ మోతాదులో నీటి చేరిక

నాగార్జునసాగర్,

ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు- ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థం 590.00అడుగులకుగాను ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గేట్లు- ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం నాగార్జున సాగర్ గేట్లను ఎత్తారు. మంత్రులచేతుల మీదుగా ఉదయం 11 గంటలకు గేట్లను తెరిచారు. మొత్తం 14 గేట్లను 5 అడుగుల మేర ఓపెన్ చేశారు. అయితే సాగర్ గేట్లను ఎత్తడానికి ముందు బేగంపేట ఎయిర్‌పోర్టులో మంత్రుల గొడవపడ్డారు. షెడ్యూల్ ప్రకారం నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు నాగార్జున సాగర్ గేట్లను తెరువాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకు అందరూ బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కానీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గంట ఆలస్యంగా 10 గంటలకు వచ్చారు. ఈ విషయంలో కోమటిరెడ్డికి, ఉత్తమ్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాను నాగార్జునసాగర్‌కు రానని అలిగి బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లిపోయారు. దాంతో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ మాత్రమే హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లారు. పూజా కార్యక్రమం నిర్వహించి సాగర్ 14 గేట్లను ఎత్తారు. దాంతో కృష్ణమ్మ దిగువకు పరవళ్లు తొక్కుతూ పరుగులు తీస్తోంది. కాగా నాగార్జునసాగర్ జూలై నెలలో ఈ స్థాయిలో నిండటం గడిచిన 18 ఏళ్లలో ఇదే తొలిసారని అధికారులు తెలిపారు.

# 4వేల టన్నుల బొగ్గు మాయంపై హైకోర్టు ఆగ్రహం

## వానదేవుడే బొగ్గును మాయం చేశాడు

## భారీ వర్షాలకు కొట్టుకు పోయి ఉంటుంది

## మేఘాలయ మంత్రి ఆసక్తికర సమాధానం

షిల్లాంగ్,

మేఘాలయాలో సుమారు నాలుగు వేల టన్నుల బొగ్గు అదృశ్యమైంది. ఆ నల్ల బంగారం మాయం కావడం పట్ల రాష్ట్ర సర్కారుపై హైకోర్టు సీరియస్ అయ్యింది. బొగ్గు ఎక్కడికెళ్లిందో చెప్పాలని కోర్టు నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఎక్సైసజ్ శాఖ మంత్రి కిర్మెన్ షిల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బహుశా వర్షాలు, వరదల వల్ల ఆ బొగ్గు కొట్టుకుపోయి ఉంటుందని ఆయన అన్నారు. జోరు వానల వల్ల బొగ్గు మాయమై ఉంటుందన్నారు. రాజాజూ, డెంగన్‌గాన్ గ్రామాల్లో ఉన్న బొగ్గు నిల్వల నుంచి సుమారు 4 వేల టన్నుల బొగ్గు కనిపించకుండాపోయింది. ఆ కేసులో అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బొగ్గు మాయం గురించి అడిగిన సమయంలో మంత్రి మాట్లాడుతూ.. మేఘాలయాలో అత్యధిక వర్షపాతం కురుస్తుందని, మీకు ఈ విషయం తెలియదని, ఆ వానల వల్ల బొగ్గు కొట్టుకుపోయే ఛాన్సు ఉందని అన్నారు. బొగ్గు ఎలా అదృశ్యమైందో చెప్పడం తన ఉద్దేశం కాదు అని, సహజ పద్ధతిలో ఆ బొగ్గు మాయమైందా లేక అక్రమ విధానాల వల్ల అది పోయిందా అన్న విషయాన్ని తేల్చలేకపోతున్నట్లు- ఆయన చెప్పారు. మేఘాలయాలో 2014 నుంచి బొగ్గు మైనింగ్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆపేసింది. పర్యావరణ కారణాలు, అసురక్షిత పద్ధతుల వల్ల బొగ్గు తొవ్వకాలను నిలిపివేశారు. మేఘాలయాలో అక్రమ రీతిలో మైనింగ్ జరుగుతున్నట్లు- ఆరోపణలు ఉన్నాయి. అయినా ఈ ఏడాది ఆరంభంలో ఈస్ట్ జైంతియా కొండల్లో బొగ్గు మైనింగ్‌ను ప్రారంభించారు. ఒకవేళ బొగ్గు మాయమైనా.. అది బ్రతకడం కోసమైతే అక్రమంగా జరిగి ఉంటుందేమో అని, లేదంటే ఆ బొగ్గును ఎవరు తీసుకెళ్తారని మంత్రి అన్నారు.

# కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష

## రద్దయ్యిందన్న వార్తలను ఖండించిన కేంద్రం

న్యూఢిల్లీ,

కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. అవన్నీ అవాస్తవమని పేర్కొన్నాయి. నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదని మంగళవారం వెల్లడించాయి. నిమిష ఉరిశిక్షను రద్దు చేస్తూ యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. అక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్షణ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. దీనిపై భారత విదేశాంగ శాఖ వర్గాలు తాజాగా స్పందించాయి. నిమిష మరణశిక్ష రద్దు చేశారంటూ కొంత మంది వ్యక్తులు నుంచి వచ్చిన సమాచారం అవాస్తవమని వెల్లడించాయి. ఈ విషయంపై తమకు యెమెన్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని పేర్కొన్నాయి. యెమెన్ జాతీయుడు మహద్ హత్యకేసులో నిమిష ప్రియకు మరణశిక్ష పడిన విషయం తెలిసిందే. మహద్‌తో కలిసి ఆమె వ్యాపారం చేసింది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఆమె తన పాస్‌పోర్టు కోసం అడిగింది. కానీ పాస్‌పోర్టు ఇచ్చేందుకు మహద్ నిరాకరించడంతో అతడికి మత్తుమందు ఇచ్చి తీసుకునేందుకు నిమిష ప్రయత్నించింది. అయితే డోస్ ఎక్కువ కావడంతో మహద్ మర ణించాడు. దాంతో యెమెన్ పోలీసులు నిమిషను హత్య కేసులో అరెస్ట్ చేశారు. ఆమె ముందుగా స్థానిక కోర్టు మరణశక్ష విధించింది. ఆ శిక్షను టాప్ కోర్టు సమర్థించింది. దాంతో ఈ నెల 16న నిమిషకు ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు- ప్రకటించారు. నిమిషకు శిక్ష తప్పించేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నించిన భారత ప్రభుత్వం.. ఇక తాను చేసేదేమీ లేదని చేతులెత్తేసింది. జూలై 16న అమలు చేయాల్సిన మరణశిక్ష చివరి నిమిషంలో వాయిదా పడింది.

# బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

## ప్రభుత్వ అనుమతితో 4 నుంచి దీక్షకు దిగుతా

## లేదంటే ఎక్కడుంటే అక్కడే దీక్ష చేస్తా

## జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక

హైదరాబాద్,

బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం తాను 72 గంటలు దీక్ష చేస్తే నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ .... 2018 పంచాయతీ రాజ్ సవరణ చట్టాన్ని సవరణ చేస్తూ తెలంగాణ జాగృతి చేసిన డిమాండ్ తోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. తమిళనాడులో గవర్నర్ జాప్యం చేస్తే కోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకున్నారని మరి తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ వద్ద పెండింగ్ అంశంపై కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే సానుకూల తీర్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఒప్పందం కారణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. తాము ఢిల్లీలో చేసే ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటు-న్నారు... ఇదేమైనా సత్రం భోజనమా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అఫీషియల్ గా అఖిలపక్షంను ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఢిల్లీకి రావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వం లేఖలు రాయలన్నారు. పొన్నం ప్రభాకర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం డ్రామా చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా శూన్యం అని రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకుంటోందని విమర్శించారు. బీజేపీ బీసీ సీఎం, బీసీ పీఎం అంటు-న్న బీజేపీకీ బీసీలపై చిత్తశుద్ధి లేదని కవిత ధ్వజమెత్తారు.

# పులుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం !

దేశంలో పర్యావరణంపై ఆసక్తి, శ్రద్ధ లేకుండా పోతోంది. మానవజాతి పెరుగుతున్నా కొద్దీ పక్కనున్న ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. అడవులను నరికివేస్తూనే..అడవుల్లోని జంతుజాలాన్ని కూడా ఉనికి లేకుండా చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక జంతుజాతులు నశించాయి. మనం బతికితే చాలు...మిగతా ఏమయితే ఏమిటన్న ధోరణి ప్రబలింది. ఈ క్రమంలో అడవుల విధ్వంసంతో జంతుజాలం నశిచింది. ప్రపంచవ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట 29 జులై రోజున 'అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్ డే' పాటించడం ఆనవాయితీగా మారింది. 2010 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025 అంతర్జాతీయపులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామరస్యంగా సహజీవనం చేయడం అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణ బాధ్యతలను వివరించడం జరుగుతుంది. ఇటీవల ఆదిలాబాద్ కవ్వాల్ రక్షణకు జివో 49ని తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. కానీ అందరూ ఒక్కటై దానిని అమలు చేయకుండా పక్కన పెట్టేయించారు. ఇది అమలు చేయడం ద్వారా పులుల సంరక్షణకు ప్రభుత్వం పూనుకుంది. కానీ గిరిజనుల జీవనానికి ఇది అడ్డంకిగా మారిందన్న ఆందోళనతో పులుల రిజర్వ్ ఫారెస్ట్ రోణ పక్కకు పోయింది. నిజానికి ఇది ప్రజల్లో అవగాహన లేమి కారణంగా జరుగుతున్నదని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. జీవవైవిధ్యం కాపాడటంలో పులులదే కీలక పాత్ర. వాటికి తెలియకుండానే అడవిని రక్షిస్తుంటాయి. మొక్కలను తినే జీవ జాతులను పులులు చంపి తినకపోతే అడవి అనేదే మిగలదు. అంటే...సాధు జంతువులను వేటాడుతూ...పులులు ఎకో సిస్టమ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఉంటాయి. అయితే రానురాను అడువులు ధ్వంసం అవుతుండటం వల్ల వీటి సంఖ్య తగ్గిపోతోంది. అవి మనుగడ సాగించేందుకు అవసరమైన అనుకూల వాతావరణం ఉండటం లేదు. క్రమంగా ఇవి అంతరించి పోయే ప్రమాదముందని గుర్తించిన ప్రపంచ దేశాలు, ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుకుంటున్నారు. ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టు-పక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతో కూడిన దట్టమైన అడవి ఉండాలి. అందుకే ఈ లెక్కన ఇప్పుడున్న పరిస్థితుల్లో పులులు. మనుగడ సాగించాలంటే...ఒక్కో పులికి 25 వేల ఎకరాల అడవిని కాపాడుకోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. పులి తన ప్రాణాలు కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంది. మూడేళ్ల వయసు రాగానే మగ పులి సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు- చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. అయితే అడవులు అంతరించడం. అడవుల్లో నీటి కుంటలు లేకపోవడం వల్ల అవి ఊళ్లలోకి రావాల్సి వస్తోంది. నగరాలు పెరగడం, గ్లోబలైజేషన్ ప్రభావంతో రానురానూ అడవులు తగ్గిపోతున్నాయి.

# మానసిక సమస్యలతో సతమతం

## ఆఫీస్ నుంచి దూకి టెక్కీ ఆత్మహత్య

ముంబై,

మహారాష్ట్రలోని పుణెలో ఓ ఐటీ- ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఆఫీసులో మీటింగ్ జరుగుతుండగా మధ్యలో బయటకు వెళ్లిన ఆ టెకీ.. భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నాసిక్‌కు చెందిన 23 ఏళ్ల పీయూష్ అశోక్ కవాడే పుణెలోని హింజెవాడి ఐటీ- పార్క్‌లోని ఓ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే సోమవారం ఉదయం ఆఫీసుకు వచ్చిన అతడు కంపెనీ మీటింగ్‌కు హాజరయ్యాడు. మధ్యలో అస్వస్థతగా ఉందని చెప్పి మీటింగ్ నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే బిల్డింగ్ ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తోటి ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్‌ను గుర్తించారు. జీవితంలో విఫలమయ్యా. నన్ను క్షమించండి. మీకు కొడుకుగా ఉండేందుకు నాకు అర్హత లేదని కుటుంబసభ్యులనుద్దేశిస్తూ లేఖ రాసినట్లు- పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు- తెలిపారు. పీయూష్ గతేడాది జులైలోనే ఈ కంపెనీలో చేరాడు. పనిఒత్తిడి, మానసిక సమస్యల కారణంగానే అతడు బలవన్మరణానికి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# మడికట్టు మొద్దుబారింది

**రామయ్య పొద్దుపొద్దుగాల్నే పండ్ల పుల్లేసుకుని ఆగమాగమైతాండు. ఎటో పొయ్యేందుకు రడీ అవుతున్నట్టు మాత్రం తెలుస్తాంది. మందలిస్తే ఏమంటడో అని అనుమానపడ్తూనే 'రాత్రి నాలుగు సిన్కులు రాలినై కదా నీళ్లు వందర్లవడి పోకుండా సూసొస్తడో ఏందో..' అని ఇంటావిడ గింత చాయ తాగిపోరాదు.. అంటూ పిలిసింది. 'నేను మల్లత్త అర్జంట్ పనున్నది' అనుకుంట బజార్లకు పోనేపోయిండు. ఏగిరం ఏగిరంగా ఉర్కుతనే ఉన్నడు.దారంటి పోతాంటే రామయ్య ఆత్రుత సూసిన రాయమల్లు 'ఏమైందిరా రాములుపండ్లు తోముకుంట ఏగిలివారంగనే ఎటో ఆగమాగంగా పోతానవ్.." అన్నా కూడా పట్టించుకోకుండా పోతనే ఉన్నడు. అయినా ఊర్కోకుంట 'మందలిత్తే కూడా మాట్లాడకుంట పోతనే ఉన్నవ్.. ఏమైందిరా రామ..' అంటూ మల్లోసారి గట్టిగనే అన్నడు రాయమల్లు. 'ఏమవుడేందే.. నాటేసేందుకు ఇయ్యాల ట్రాక్టరస్తాంది. కూలోల్లకు గుత్తకిచ్చేందుకు ఆగమ్మతో మాట్లాడినం. నిన్ననే ఒడ్లు చెక్కుడైంది. నారు పీకేటందుకు ఇగ వత్తరు. మొన్న సేటు దగ్గరికిపోతే ఇయ్యాల పిండి బత్తాలకు రమ్మన్నడు. పోకపోతే మల్ల నా జిమ్మేదార్ లేదని జెప్పిండు. ఆ యాల్లంతా నిలబడ్డదంతా పోతదని గింత పనున్న ఉర్కుడైతాంది' అనుకుంటనే జంగలేత్తనే ఉన్నడు రామయ్య.సాధించడం అంటే ఇంకా మెరుగ్గా చూపాలి కానీ, ఎవరి మీద కోపంతోనో, ఇంకెవరికో పేరొస్తుందనో 'సాధింపు'నకు దిగడం ఏంటి? దశాబ్దాల కాలంగా దగాపడి, దండుగనుకున్నా విడిచి ఉండలేక, ముంచినా.. తేల్చినా భూదేవరే అనుకుని పట్టుకొని వేలాడిన బక్క పల్చని భూమి పుత్రులు ఎందరో.. ఎందరెందరో!నమ్మిన అమ్మ వంటి మట్టిలోనే బొర్లుతూ.. వేరోటి చేయడం ఇష్టం లేక అందరికి అన్నం పెట్టేందుకు కడుపులు మాడ్చుకున్నారు.. బతుకులు కాల్చుకున్నారు.**

తలాపునే సముద్రం ఉన్నా శాప దూపకు ఏడ్చేలా చేసిన బతుక నేర్చిన స్వార్థపుగాళ్ల బండారం బయటపెట్టి సంసారం సక్క బెట్టే దందుకు సన్నటి మనిషి చెయ్యాల్సినంత చేసిండు.బుక్కెడు బువ్వ తప్ప ఏమీ ఆశించని హలం కార్మికుడికి ఏదన్నా చేస్తేనే బతుకులు బాగుపడుతాయి. రాష్ట్రమూ రాణిస్తుందని ఆలోచన చేసిండు. నెర్రెలు బారిన భూమికి బుక్కెడు నీళ్లు తాగిద్దాం.. సాగుకు బాస్తున్న రైతుకు కావాల్సినవి ఇద్దామని కాయిసు పడ్డడు. పదేండ్లు ఇరాము లేక ఏమేం చెయ్యాల్నో చేసిండు. పగటిల్లి కరెంట్.. కావాల్సినన్ని విత్తనాలు.. సరిపడా ఎరువులు.. సర్వం సమకూర్చిండు. సాగు సంబురం ఎట్లుంటదో చూపిండు. సద్ది పట్టుకొని ఓట్లపొంటి చేనుకుపోవాల్సిన రైతన్న సేట్ల దుకాణాల ముందు సొడిపడ్తాండు. బిడ్డసొంటి పంటను సూసుకుంటూ పొద్దంతా గడపాల్సిన మనిషి గొడ్డుగోదను, పెండ్లాం పిల్లల పట్టింపు లేకుండా ఎరువుల కోసమని ఓ సావై సత్తాండు. అసలే పనుల సీజన్, కూలోళ్ల కొరత, నాట్లు ఊపందుకున్నది. పోసిన నార్లు ముదురుతున్నయ్. కాలం ఇంకా అందుకోలే, కరెంట్ సక్కగా ఉండేది లే. చెర్లలో నీళ్లు లేవు, బావుల్లోకి ఊట దిగింది కాదు.. వచ్చిరాని కరెంటు.. రాలుతున్న నాలుగు సినుకులు.. మడికట్టు తడుపుకుంటూ రోజుకో దిక్కు నీళ్లు ఎగేస్తూ దున్నుడెప్పుడు కావాలే, నాటెప్పుడు పడాల్రా దేవుడా%ో% అని గుబులుపడుతున్న అన్నదాత. గిసొంటి గందరగోళంల, సక్కగ కూసోని తినడానిక్కూడా టైంలేని రైతన్న అన్నీ ఇడ్సిపెట్టి పనీపాటా లేనోని లెక్క పిండి బత్తాల కోసం పొద్దంతా పడిగాపులు పడాల్సి రావట్టె. చెప్పులు, గోనె తట్లు, చిన్నచిన్న బండలు, తువ్వాలలు, రంగురంగుల ప్లాస్టిక్ కవర్లు, చెత్తిర్లు, చేయి సంచులు%ో% మళ్లా లైన్లు కడ్తానయ్. పదేండ్లు గడియ కూడా ఇరాము లేకుండా పనుల్లో మునిగిన రైతన్న ఇప్పుడు మళ్లా దుకాండ్ల ముందు గోల్లు గిల్లుకుంటూ పొద్దంతా పనికి పోతాండు. మొన్నటి దాకా పండిన పంటకు కొనే దిక్కు లేక బావురుమన్న రైతన్న ఇప్పుడు సాగుకు సౌలతి లేక సత్తున్నాడు. కూలుతున్నదని కాళేశ్వరాన్ని చిన్నబుచ్చడంతో ఇప్పటికే డ్యామ్‌లు ఆట మైదానాలైనయ్. చెర్లు, కుంటలు ఇంకిన కళ్లతో ఏడుస్తున్నాయి. సాగు సాగాలంటే శావుమర్ణం అయ్యేట్టుందని భయం పట్టుకొన్న అన్నదాతకు ఇప్పుడు యూరియా కొరత ఇంకా రంది చేస్తాంది. గతాన్ని మర్చిపోయి హాయిగా ఉంది ప్రస్తుతం అనేలా చేసుకోవడం ఉత్తముల విధానం. అందునా చెమట కష్టం తప్ప మరేమీ తెలియని కర్షకుడికి కావలసినవి సమాకూర్చితే దేవుడిగా కొలుసుకుంటాడు తప్ప, ఇంకేమీ గుర్తుపెట్టుకోడు. అలాంటి అన్నదాతకు అక్కర కొచ్చేది ఇవ్వక, అంగట్లో బొమ్మల దుకాణాల ముందు, రోడ్ల వెంట నిలబెడితే పరిస్థితి ఏం మారినట్టు. నిరుడు దాకా లేని ఎరువు కష్టాలు నేడెందుకు వచ్చాయో, అంతగా కొరత ఎందుకు ఏర్పడిందో మేధావులం అయిన మనంత తెల్వకున్నా కాస్తో కూస్తో మట్టిలో మెదిలే ఆయనకు తెలియదనుకుందామా..? పొద్దున్న లేస్తే మొదలు పండే దాకా పక్కోడిపై పడి ఏడ్చేందుకు పోటీ పడటం.. పనులన్నీ పక్కనపెట్టి దుమ్మెత్తి పోసుకోవడమే పనిగా పెట్టుకొని సర్వాన్ని ఆగం చేసే చట్రం నుంచి బయటకువచ్చి చెయ్యాల్సినవి చేసే అవసరం ఉందా.. లేదా? మెరుగును ఆశించిన ప్రజకు ఇప్పటికే మోసం జరిగిందనే ముచ్చట తెలిసిందో, లేదో.. రచ్చబండ సాక్షిగా చర్చ జరుగుతుందో, లేదో గ్రహించాలి. అంతా చేసిన, సకలం సమకూర్చిన గతమోళ్లకే గా పరిస్థితి వస్తే.. గాయి గాయి రేపుతున్న మన గతేమని గమనించాలే. అవసరం ఉన్న పిండి బస్తాలు అదును దాటకముందే అందించి.. అన్నం మట్టిపాలు చేయక, అన్నదాతను ఆగం చేయకుంటే అదే మహా భాగ్యం. రంగులు మార్చే రాజకీయం రైతుపై కాకుండా.. ఇంక దేనిమీదనన్న పెట్టుకుందాం. దశాబ్దం నుంచి ఎరువు ఆలోచన లేని, యూరియా కరువు ముచ్చట్లు కానరాని సాగుదారుడి ఇగనన్న సాయం కోసం సంకల్పిద్దాం. ఒకటి కాదు, రెండు కాదు.. పది కాదు, ఇరవై కాదు.. వేల టన్నుల ఎరువు కొరతను తీర్చే విషయంపై దృష్టిపెడితేనే సాగు సంబురం. లేదంటే ఇప్పటికే అటకెక్కించిన కౌలు ముచ్చట, సగం సగంగా మారిన భరోసా, ధీమా కోల్పోయిన బీమా, మొఖం మాడ్చిన 'మద్దతు' లెక్క.. సాగు 'చేతి'కిల పడ్తది. నాటి సర్కార్ కల్పించిన ధైర్యం కూడా పోయి మడికట్టు మొద్దుబారుతది.

# గిల్ ప్రత్యర్థికి స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తే బాగుండేది

## బెన్ స్టోక్స్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సునీల్ గావస్కర్

మాంచెస్టర్ టెస్టు చివరి రోజున ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యవహరించిన తీరుపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి టెస్ట్ తర్వాత స్టోక్స్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తిరిగి వారికే తగిలాయని గుర్తు చేశారు. ముందస్తు 'డ్రా' ఎత్తులు వేసిన బెన్‌స్టోక్స్‌కు గిల్ కొన్ని ప్రశ్నలు సంధించి ఉంటే బాగుండేదని భారత్? సారథికి సూచించారు. అంతేకాకుండా టెస్టు క్రికెట్ చరిత్రలో ఈ మ్యాచ్ నిలిచిపోతుందని, టీమ్‌ఇండియా పోరాటం అద్భుతమని కొనియాడారు'నాకు ఇది చాలా సంతృప్తి ఇచ్చిన మ్యాచ్. భారత జట్టు ఆడిన తీరుపై



నేను చాలా గర్వపడుతున్నా. కేవలం నాలుగు వికెట్లను మాత్రమే ప్రత్యర్థికి ఇచ్చారు. మంచి పిచ్, ఫ్లాట్ పిచ్ ఏదైనా సరే తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు ప్లేయర్ల ఆట ఆకట్టుకుంది. అయితే నేను ఇక్కడ నేను ఇంగ్లాండ్ జట్టును చాలా ప్రశ్నలు అడగాలని అనుకుంటున్నా. బర్మింగ్ హామ్‌లో జరిగిన మ్యాచ్?లో ఇంగ్లాండ్?కు భారత జట్టు 600ం టార్గెట్‌ను ఇచ్చింది. ఆ సమయంలో టీమ్‌ఇండియా భయపడిందని అంటూ ఇంగ్లాండ్ నుంచి వ్యాఖ్యలు వినిపించాయి.



అంతకుముందు లీడ్స్‌లో 370ం లక్ష్యాన్ని కొట్టిన జోష్?లో ఎంతైనా కొడతామని ఇంగ్లాండ్ ప్రగల్భాలు పలికింది. కానీ రెండో టెస్టులో మాత్రం 336 పరుగుల తేడాతో ఓడింది. మరి ఆ ధైర్యం ఏమైంది?' అని గావస్కర్ వ్యాఖ్యానించాడు. అలాగే శుభ్?మన్? గిల్? కూడా ప్రత్యర్థికి గట్టిగా బదులు ఇచ్చి ఉంటే బాగుండేదని సునీల్ గావస్కర్ అన్నారు. ఈ విషయంలో కాస్త కఠినంగా వ్యవహరించాలని, మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చుంటే బాగుండేదని సూచించారు. అప్పుడు స్టోక్స్‌కు కొన్ని ప్రశ్నలు సంధించమని గిల్‌కు చెప్పేవాడినని అన్నారు. 'నువ్వు ఎందుకు 311 పరుగుల వరకూ ఆధిక్యం తీసుకెళ్లావు? 240 పరుగుల లీడ్‌తో సరిపెట్టుకోవచ్చుగా? కనీసం బెన్ స్టోక్స్ సెంచరీ తర్వాతనైనా డిక్లేర్డ్ చేయొచ్చుగా? అప్పుడు మీ బౌలర్లకు అదనంగా మరో గంట సమయం ఇవ్వొచ్చుగా?' అనే ప్రశ్నలు అడిగించేవాడిని అన్ని తెలిపారు. అయితే, గిల్ అలా అడుగుతాడని అనుకోలేదని, అతడు మరీ సున్నితంగా ఉండే వ్యక్తి అని చెప్పారు. కానీ, తాను మాత్రం కచ్చితంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ప్రశ్నించేవాడినేని తెలిపారు. ఇప్పుడైనా ఇవే ప్రశ్నలు అడుగుతానని గావస్కర్ వ్యాఖ్యానించారు.



# ఫిడే మహిళల ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్

## ఫైనల్లో కోనేరు హంపి ఓటమి

ప్రపంచ మహిళల చెస్ చాంపియన్ గా దివ్య దేశ్ ముఖ్ విజయం సాధించారు. టైబ్రేక్ కు దారి తీసిన ఫైనల్లో దివ్య .. కోనేరు హంపీని ఓడించారు. దివ్య దేశ్ ముఖ్ వయసు 19 ఏళ్లు మాత్రమే. చిన్న వయసులోనే ప్రపంచ కప్ టైటిల్ సాధించి రికార్డు సృష్టించారు. ఫైన్‌లో హంపి తీవ్రంగా పోరాడింది, కానీ దివ్య దేశ్‌ముఖ్ తన కొత్త తరహా ఆటతో హంపీని ఓడించింది. ఫైనల్‌లో గెలవడం ద్వారా దివ్య గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను డైరెక్ట్ గా సాధించేసినట్లయింది. గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను సాధించడానికి, ఒక ఆటగాడు మూడు %+వీ% నార్మ్‌లను, 2500 రేటింగ్‌ను సాధించాలి. దివ్య ఫిడే మహిళల వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా డైరక్ట్ టైటిల్ సాధించారు.ఇది ఆమెను కొనేరు హంపీ, హరిక ద్రోణవల్లి, ఆర్. వైశాలి తర్వాత భారతదేశం



నాల్గవ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచేలా చేస్తుంది. ఫిడే నిబంధనల ప్రకారం మూడు నార్మ్‌లు , 2500 రేటింగ్ అవసరాన్ని దాటవేస్తుంది. దివ్య ఆక్రమణాత్మక , టాక్టికల్ చెస్ ఆడటంలో మంచి నైపుణ్యం సాధించారు. 19 సంవత్సరాల వయస్సులో, దివ్య తన ఆటలో అసాధారణమైన పరిపక్వతను ప్రదర్శిస్తున్నారని చెస్ ప్లేయర్లు ప్రశంసిస్తున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ కు చెందిన దివ్యా దేశ్ ముఖ్ 2021లో భారతదేశం 21వ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచారు. ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్‌ను గతంలోనే పొందారు. 2025 ఫిడే మహిళల వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరుకోవడం ద్వారా ఆమె మొదటి గ్రాండ్‌మాస్టర్ నార్మ్‌ను సాధించింది. ఇప్పుడు టైటిల్ కూడా సాధించి తిరుగులేని భవిష్యత్ ఉందని నిరూపించింది.



దివ్య దేశ్‌ముఖ్ అనేక అంతర్జాతీయ జాతీయ టోర్నమెంట్లలో అద్భుతమైన ప్రతిభ చూపింది. జూన్ 2024లో, దివ్య 18 సంవత్సరాల వయస్సులో వరల్డ్ జూనియర్ గర్ల్స్ టైటిల్‌ను గెలుచుకుంది, కొనేరు హంపీ (2001), హరిక ద్రోణవల్లి (2008), సౌమ్య స్వామినాథన్ (2009) తర్వాత ఈ టైటిల్ గెలిచిన నాల్గవ భారతీయ చెస్ ప్లేయర్ గా నిలిచారు. కోనేరు హంపితో పోలిస్తే దివ్య దేశ్‌ముఖ్ పెద్దగా అనుభవం లేని క్రీడాకారిణి. నాగపుర్‌కు చెందిన దివ్య, సీనియర్ విభాగంలో ఆడిన టోర్నీలు కూడా తక్కువగానే ఉన్నాయి. ఈ టోర్నీ ఫైనల్స్ ముందు వరకు గ్రాండ్‌మాస్టర్ హోదా కూడా అందుకోలేదు. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను పొందింది దివ్య. ఆ తర్వాత 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఒలింపియాడ్‌లో మూడు పసిడి పతకాలు కూడా దివ్య ఖాతాలో ఉన్నాయి. గతేడాది తొలిసారి 2500 ఎలో రేటింగ్‌ను అందుకుంది. దూకుడైన ఆటతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతినిపిస్తోంది. తాజాగా ప్రపంచకప్‌లో తనకన్నా మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక (క్వార్టర్‌ఫైనల్), జు జినర్ (ప్రిక్వార్టర్స్)పై నెగ్గడమే ఇందుకు ఉదాహరణ. సెమీస్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ జాగ్‌యిపై గెలవడం ఆమెను మరో మెట్టు ఎక్కించింది. ఇక మహిళల ప్రపంచ ఛాంపియన్?గా నిలిచిన దివ్య దేశ్?ముఖ్?ను విశ్వనాథన్ ఆనంద్ అభినందిస్తూ ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఇది ఉక్కంత భరితమైన పోరుని, కోనేరు హంపి కూడా మంచి ఆటతీరు పోరాటస్ఫూర్తిని కనబర్చారని తెలిపారు. భారత చదరంగానికి ఇది సంబరాలను తెచ్చిన విజయం ఇది అంటూ రాసుకొచ్చారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## మాంచెస్టర్ టెస్టులో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన టీమిండియా

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగిన నాలుగో టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో రెండు రోజుల ముందు భారత జట్టు ఓటమి ఖాయమనిపించింది. సిరీస్ 3-1 అవుతుందని మ్యాచ్ చేజారిపోతున్నట్లు కనిపించింది. కానీ భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ బ్యాట్స్‌మెన్ కెఎల్ రాహుల్, ఆల్ రౌండర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. అంతా అనుకున్నట్లుగానే చాలా కాలం కిందటి నాటింగ్ హామ్ టెస్టు స్ఫూర్తిని మళ్లీ ప్రదర్శించారు. దాంతో ఓడిపోయే మ్యాచ్‌ను టీమ్ ఇండియా డ్రాగా ముగించింది. నాలుగో టెస్టులో భారత్ ఓటమి గండం గట్టెక్కి సగర్వంగా నిలిచిందంటే ఆ నలుగురే కారణం. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా యశస్వి జైస్వాల్, సాయి



సుదర్శన్, రిషబ్ పంత్ అర్ధ సెంచరీలతో 358 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కెఎల్ రాహుల్ కూడా 46 పరుగులు సాధించాడు. లోయర్ ఆర్డర్ కాస్త పోరాడటంతో భారత్ 300 స్కోర్ చేయగలిగింది.ఓపెనింగ్ బ్యాటర్లు బెన్ డకెట్ 94 పరుగులు, జాక్ క్రాలీ 84 పరుగులు చేయడంతో ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. ఆ తర్వాత జో రూట్ 150 పరుగులు, కెప్టెన్ బెన్ స్టోక్స్ 141 పరుగులతో శతకాలు చేయడంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ అవసరమా అనే స్థితికి చేరుకుంది. ఇంగ్లాండ్ మూడో రోజు, నాలుగోరోజు ఆటలో 669 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ లో ఏకంగా 311 పరుగుల ఆధిక్యాన్ని ఇంగ్లాండ్ సాధించింది.నాలుగో రోజు ఆటలో భారత్ ఓడిపోవడం ఖాయమని అంతా



అనుకున్నారు. టీమిండియా ఒక్క పరుగు కూడా చేయకుండానే రెండు వికెట్లు కోల్పోయింది. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ ఖాతా తెరవకుండానే క్రిస్ వోక్స్ బౌలింగ్ లో పెవిలియన్ చేరారు. ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్ అవుట్ కావడంతో భారత్ 311 పరుగుల స్కోరు చేస్తుందా అనిపించింది. ఒకవేళ ఈ స్కోర్ చేసినా రెండో ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ చేయడానికి స్కోరు కూడా లేదు. జైస్వాల్, సాయి సుదర్శన్ అవుటయ్యాక కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కెఎల్ రాహుల్ మరో వికెట్ పడకుండా అడ్డు గోడలా నిలబడ్డారు. మరోవైపు పరుగులు చేస్తూ ఇన్నింగ్స్ నిలబెట్టారు. నాల్గవ రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ ఆధిక్యం కేవలం 137 పరుగులకు పరిమితం చేశారు. ఇంగ్లండ్ గెలవాలంటే చివరి రోజు 8 వికెట్లు తీయాలి. వాస్తవానికి అది పెద్ద విషయం కాదు. కానీ గిల్ సెంచరీ, రాహుల్ 90 స్కోరుతో భారత్ కొంచెం పటిష్టంగా కనిపించింది. అదే ఊపుతో వికెట్లు ఇవ్వకుండా మ్యాచ్ ను డ్రా చేసే దిశగా బ్యాటింగ్ చేశారు. .మ్యాచ్ ఐదవ రోజున కెఎల్ రాహుల్ 90 పరుగులకు అవుట్ అయ్యాడు. తర్వాత సెంచరీ హీరో గిల్ 103 పరుగుల వద్ద ఔటయ్యాడు. గాయంతో ఉన్న పంత్ బదులుగా వాషింగ్టన్ సుందర్ క్రీజులోకి వచ్చాడు. రవీంద్ర జడేజా, సుందర్ ఏమాత్రం తడబాటుకు లోనుకాకుండా తీవ్ర ఒత్తిడిలో బ్యాటింగ్ కొనసాగించారు. రవీంద్ర జడేజా 107 పరుగులు, సుందర్ 101 పరుగులతో నాటౌట్ గా నిలిచారు. ఇంగ్లాండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని ఓడిపోయే మ్యాచ్ డ్రా చేశారు. మూడో టెస్టులో విజయానికి చేరువైన సమయంలో భారత్ ఆలౌటైంది. ఈసారి అలాంటి తప్పిదాలు చేయకుండా వికెట్లు కాపాడుకుంటూ పరుగులు సాధించారు. వీరి సెంచరీలు అడ్డుకునేందుకు చివర్లో బెన్ స్టోక్స్ షేక్ హ్యాండ్ ఇచ్చినా డ్రా చేసుకోవడానికి జడేజా, సుందర్ నిరాకరించారు. స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి టెస్టు మ్యాచ్ ను వీక్షించేలా చేశారు.



## ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టుకు రిషభ్ పంత్ దూరం

మాంచెస్టర్ వేదికగా జరిగిన్న నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ గాయపడిన టీమ్?ఇండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఐదో టెస్టుకు దూరమయ్యాడు. ఆ విషయాన్ని బీసీసీఐ ఇటీవల అధికారికంగా ప్రకటించింది. తన కుడి కాలుకు ఫ్యాక్చర్ కావడం వల్లే ఐదో టెస్టులో పంత్ ఆడడం లేదని వెల్లడించింది. అతడి స్థానంలో తమిళనాడు వికెట్ కీపర్ బ్యాటర్ జగదీశన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపింది.అయితే నాలుగో టెస్టులో తొలి రోజు బ్యాటింగ్ చేస్తుండగా రిషభ్ గాయపడ్డాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ చేసేందుకు ప్రయత్నించగా, బంతి నేరుగా పాదానికి బలంగా తగిలింది. దీంతో స్టేడియంలోనే బాధతో పంత్ విలవిలలాడాడు. 37 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. నాలుగో టెస్ట్?కు దూరమవుతాడని అంతా అనుకున్నారు.కానీ గాయం



వేధిస్తున్నప్పటికీ రెండో రోజు బరిలోకి దిగాడు. హాఫ్ సెంచరీ (54) బాదాడు. అయితే గాయం వల్ల పంత్ కీపింగ్ చేయలేదు. అతడికి సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ధ్రువ్‌జురెల్ వికెట్? కీపింగ్ చేశాడు. నాలుగో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా రిషభ్ బ్యాటింగ్‌కు దిగలేదు. గాయం పెద్దది కావడంతో అతడు మ్యాచ్ నుంచి వైదొలిగినట్లు బీసీసీఐ పేర్కొంది.బీసీసీఐ మెడికల్ టీమ్ పంత్ ఆరోగ్య పురోగతిని నిరంతం పర్యవేక్షిస్తూనే ఉందని కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. అతడు తొందరగా జట్టులోకి రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అయితే ఐదు టెస్ట్?కు పంత్



దూరమవ్వడంపై కోచ్ గౌతమ్ గౌంభీర్ స్పందించాడు. కాలికి గాయంతోనే పంత్ బ్యాటింగ్ చేశాడని, అతణ్ని ఎంత పొగిడినా తక్కువేనని అన్నాడు.రాబోయే తరాలు ఇలాంటి ఇన్నింగ్స్‌ల గురించి చర్చించుకుంటాయని పేర్కొన్నాడు. పంత్ మంచి ఫామ్‌లో ఉన్న సమయంలో ఇలా గాయపపడం చాలా దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. అతడు తొందరగా కోలుకొని త్వరగా జట్టులోకి చేరతాడని ఆశిస్తున్నానని, టెస్టు క్రికెట్‌లో రిషభ్ చాలా విలువైన ఆటగాడంటూ మ్యాచ్ అయ్యాక గంభీర్ మాట్లాడాడురు.కాగా, మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది. రవీంద్ర జడేజా (107లి), వాషింగ్టన్ సుందర్ (101లి) అసాధారణ ఆటతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసేలా చేసారు. అంతకుముందు శుభ్‌మన్ గిల్ (103) శతకం బాదేశాడు. కేఎల్ రాహుల్ (90) త్రుటిలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. అయితే నాలుగో మ్యాచ్ డ్రాతో ప్రస్తుతం 2-1 తేడాతో ఇంగ్లాండ్ ఆధిక్యంలో ఉంది. ఐదో టెస్టు ఈనెల 31న లండన్‌లోని ఓవల్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సిరీస్ 2-2 తేడాతో ముగియనుంది.



## టెస్ట్ సిరీస్ గెలుపుపై భారత్ దృష్టి

### పలు మార్పులతో బరిలోకి దిగే అవకాశం

మాంచెస్టర్‌లో జరిగిన నాల్గవ టెస్ట్ మ్యాచ్‌లో భారత్ క్లిష్ట పరిస్థితులను అధిగమించి మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ధైర్యసాహసాలు జట్టును ఓటమి నుండి కాపాడాయి. అయితే ఈ టెస్ట్ తర్వాత భారత్ ఇప్పటికీ సిరీస్‌లో 1-2తో వెనుకబడి ఉంది. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ ఐదవ, చివరి టెస్ట్ మ్యాచ్ లండన్‌లోని ఓవల్ మైదానంలో జూలై 31 నుండి ఆగస్టు 4 వరకు జరుగుతుంది. ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ప్రస్తుతం 2-1తో ఆధిక్యంలో ఉంది. భారత్ ఇప్పుడు ట్రోఫీని గెలుచుకునే అవకాశం లేదు. కానీ సిరీస్‌ను డ్రా చేసుకోవడం ద్వారా గౌరవప్రదమైన పునరాగమనం చేసే అవకాశం ఖచ్చితంగా ఉందనే చెప్పవచ్చు.అయితే ఈ నిర్ణయాత్మక టెస్ట్ కు ముందు.. టీం ఇండియా గాయాలు, ఫామ్ అనే



రెండు సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలోనే చివరి టెస్ట్ కోసం భారత జట్టులో కనీసం నాలుగు మార్పులు జరిగే అవకాశం ఉంది. మాంచెస్టర్ టెస్ట్ డ్రా అవ్వడం భారత్ కు ఖచ్చితంగా ఉపశమనం కలిగించిందనే చెప్పవచ్చు. కానీ ఓవల్ టెస్ట్ కోసం భారత్ సన్నాహాల్లో అతిపెద్ద అడ్డంకి ఇద్దరు కీలక ఆటగాళ్ళు రిషబ్ పంత్, జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం.మాంచెస్టర్ టెస్ట్ సందర్భంగా భారత టెస్ట్ జట్టు వైస్ కెప్టెన్, వికెట్ కీపర్ రిషబ్



పంత్ కాలి వేలుకు గాయం అయ్యింది. దీంతో అతను ఐదవ టెస్ట్‌కు దూరంగా ఉన్నాడు. అతని స్థానంలో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చే అవకాశం ఉంది. పంత్ స్థానంలో ఎన్ జగదీసన్‌ను జట్టులోకి తీసుకున్నప్పటికీ, జురెల్‌కు ఆడే అవకాశం లభించే అవకాశం ఉంది. జురెల్ కూడా ఇండియా ఎ జట్టులో సభ్యుడు, కాబట్టి అతనికి జగదీసన్ కంటే కొంచెం ఎక్కువ అనుభవం ఉంది.జట్టు ప్రధాన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా షెడ్యూల్ ప్రకారం ఈ సిరీస్‌లో కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడాల్సి వచ్చింది.ఇప్పుడా కోటా పూర్తయింది. అతను ఓవల్ టెస్ట్‌లో ఆడకపోవడం దాదాపు ఖాయం. అయితే మ్యాచ్ తర్వాత ప్రెస్ మీట్ లో గౌతమ్ గంభీర్ తన ఆటపై సస్పెన్స్ వ్యక్తం చేశాడు. మొదటి రెండు టెస్టులు ఆడిన ఆకాశ్‌దీప్ సింగ్‌ను తిరిగి అతని స్థానంలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నాల్గవ టెస్ట్‌లో ఫిట్‌నెస్ కారణంగా అవుట్ అయ్యాడు.నాల్గవ టెస్ట్‌లో ఆకాష్‌దీప్ స్థానంలో ఆడిన అన్షుల్ కాంబోజ్ అంతగా రాణించలేదు. అతని స్పీడ్ లైన్-లెంగ్త్ నిరుత్సహా పరిచాయి. అతనికి ఫిట్‌నెస్ సమస్యలు ఉండటంతో అతన్ని తొలగించి అతని స్థానంలో అర్షదీప్ సింగ్ అరంగేట్రం చేసే అవకాశం ఉండవచ్చు. నాల్గవ టెస్ట్‌కు ముందు అర్షదీప్ గాయపడ్డాడు. కానీ ఇప్పుడు



అతను పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడు. నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నాడు. అర్షదీప్ సింగ్ ఫిట్‌గా లేకపోతే, ప్రసిద్ధ్ కృష్ణను తీసుకునే ఛాన్స్ ఎక్కువగా ఉంది. నాల్గవ టెస్ట్‌లో శార్దూల్ ఠాకూర్‌కు ఆల్ రౌండర్‌గా అవకాశం లభించింది. కానీ అతను బౌలింగ్ లో ప్రభావం చూపలేకపోయాడు . బ్యాటింగ్‌లో అంతగా రాణించలేదు. అతని స్థానంలో అదనపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను చేర్చుకోవాలని జట్టు పరిశీలిస్తోంది. కుల్దీప్ తిరిగి రాకపోతే, కరుణ్ నాయర్ తిరిగి వచ్చే అవకాశం కూడా ఉండవచ్చు. కానీ కుల్దీప్‌కు అవకాశం వస్తే, నాయర్ బ్యాట్స్‌మన్‌గా జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం లేదు. టాప్ ఆర్డర్‌లో సాయి సుదర్శన్ రెండవ ఇన్నింగ్స్‌లో డకౌట్ అయినప్పటికీ.. మొదటి ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నాడు.

ఓవల్‌లో జరిగే 5వ టెస్ట్ కోసం భారత సంభావ్య ప్లేయింగ్ 11:

శుభమన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్‌దీప్ సింగ్, అర్షదీప్ సింగ్/ప్రసిద్ధి కృష్ణ.

# ప్రపంచంలో సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలు ఇవే!

**పర్యటనలే మనిషిని పరిపూర్ణుడిని చేస్తాయి. 'ఓ ఏడాది గడిచిపోయే సరికి ఇంతకుముందు చూడని ప్రదేశానికి వెళ్లిరావాలి' అంటారు బౌద్ధ గురువు దలైలామా. ఇంటినుంచి అడుగు బయట పెట్టకపోతే మాత్రం ఉన్నచోటనే ఉండిపోతాం. అదే కొత్త ప్రదేశాలను చుట్టేసి వస్తే కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలు పోగేసుకుంటాం. మనసు విశాలమవుతుంది. ఇలాంటి దర్శనీయ స్థలాలు ప్రపంచంలో చాలానే ఉంటాయి. వాటిలోంచి ఈ ఏడాది సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలను సిఫారసు చేస్తున్నారు పర్యాటక నిపుణులు. మనం ఎంచుకునే చోటును బట్టి, మన జీవనశైలిని బట్టి వ్యయాలు మారుతూ ఉంటాయి. శ్రీలంక రాజధాని కొలంబో సమీపంలోని సముద్రతీర నగరం నెగొంబో. బండారనాయకే అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లోనే ఉంటుంది. సముద్రపు కయ్య (లగూన్)ను అనుసరించుకుని ఉన్న నెగొంబో శ్రీలంకలో పురాతనమైన చేపల పరిశ్రమకు నెలవైన నగరం. ఇక్కడి బీచ్ ప్రశాంతంగా ఉంటుంది.**

సముద్రం మీద మత్స్యకారులు చేపల్ని వేటాడే దృశ్యాలు కట్టిపడేస్తాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో సముద్రంలో మునిగిపోయిన బ్రిటిష్ సరుకు రవాణా విమానాన్ని చూడటానికి డైవింగ్ సదుపాయం ఉంటుంది. తీర ప్రాంతంలో మడ అడవులు ప్రత్యేక ఆకర్షణ. వీటిని చూడటానికి పడవ సదుపాయం ఉంది. అలా వెళ్తూ వెళ్తూ నీటి ఉడుములు, వలస పక్షులను చూసి పరవశించిపోవచ్చు. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్నేశ్వరం దేవాలయం, స్థానికంగా ఉండే చేపల మార్కెట్ కూడా దర్శనీయమే. ఇక్కడి పెద్దపెద్ద హోటళ్లు విండ్ సర్ఫింగ్, సెయిలింగ్, స్కీయింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తుండటం విశేషం.

## కోహ్ కేర్, కాంబోడియా

కాంబోడియా దేశంలోని పవిత్ర నగరం. నాలుగున్నర చదరపు మైళ్ల విస్తీర్ణంలో నెలకొన్న దేవాలయాల సముదాయమే కోహ్ కేర్. ప్రసాత్ థామ్ అనే ఏడంతస్తుల పిరమిడ్ ఇక్కడి ప్రసిద్ధ నిర్మాణం. రకరకాల శిల్పాలు, రాతి చెక్కడాలు, కొలనులు, పురాతన నిర్మాణాలతో పెనవేసుకుని భారీగా పెరిగిపోయిన చెట్లు ప్రధాన ఆకర్షణ. దగ్గరి విమానాశ్రయం సియెమ్ రీప్.

## ముస్తాంగ్, నేపాల్

నేపాల్ హిమాలయ దేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ముస్తాంగ్ ప్రాంతం చూపు తిప్పుకోనివ్వని అన్నపూర్ణ, ధవళగిరి హిమగిరులు, పర్వతాల మధ్య మలుపులు తిరుగుతూ లోయల్లో హొయలొలికే నదులు, మంచుకొండల నుంచి నెమ్మదిగా జాలువారుతున్న హిమనదాలు, ఎత్తుపల్లాలతో కూడుకున్న లోయలు, జడలబర్రెలు, గొర్రెలతో ముస్తాంగ్ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. మనదేశానికి పొరుగునే ఉండే నేపాల్‌లో పర్యటన సులభమే.

## అల్మాటీ, కజక్‌స్తాన్

మధ్య ఆసియా దేశం కజక్‌స్తాన్‌లో అతిపెద్ద నగరం. పురాతనమైన సిల్క్‌రోడ్‌లో వెలసిన అల్మాటీ కజక్‌స్తాన్‌లో అత్యంత అందమైన నగరం. ట్రాన్స్ ఇలి ఆల్టాయ్ పర్వతాల నేపథ్యంతో ఉండే అల్మాటీ మంచి ప్రణాళికతో, దారికి రెండువైపులా చెట్లతో కూడిన రోడ్లు, లెక్కలేనన్ని పార్కులు, తోటలతో సందర్శకులకు మధురానుభూతులను అందిస్తుంది. ఇక్కడి అసెన్షన్ కేథడ్రెల్ ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తయిన కొయ్య కట్టడం. దీన్ని 1907లో నిర్మించారు.

## డొమినికా

కరీబియన్ దీవుల్లో కొలువైన 750 చదరపు కిలోమీటర్ల దేశం డొమినికా. అగ్నిపర్వతాలు, ఉష్ణమండల వర్షారణ్యాలు, అంతెత్తునుంచి జాలువారే జలపాతాలు ఇక్కడి ఆకర్షణ. అందుకే దీన్ని 'ప్రకృతి ద్వీపం' (నేచర్ ఐలాండ్) అని పిలుచుకుంటారు. దట్టమైన అడవులు, అందమైన రోజో లోయ, దాదాపు 200 అడుగుల వెడల్పుతో.. పొగలుకక్కుతూ మరిగే నీటి సరస్సు సందర్శనీయ స్థలాలు.


## మసా అండ్ కరారా, ఇటలీ

కళా ప్రేమికులకు స్వర్గధామం ఇటలీలోని మసా అండ్ కరారా ప్రావిన్స్. మన హిమాలయాలను తలపించే అపువన్ ఆల్ప్స్ పర్వతాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణ. ప్రపంచ ప్రసిద్ధ పాలరాతి గనులు ఇక్కడే ఉన్నాయి. మైఖేలాంజిలో రూపొందించిన సుప్రసిద్ధ శిల్పం డేవిడ్ ఇక్కడి పాలరాతితో తీర్చిదిద్దిందే. రోడ్డు వారగా శిల్పుల ఉలి సవ్వళ్లు వినిపించడం మసా అండ్ కరారా విలక్షణత. ఆల్ప్స్ పర్వతాలకు తోడు మధ్యధరా సముద్రతీర బీచ్‌లు, భారీతనం ఉట్టిపడే క్రైస్తవ కేథడ్రెల్‌లు, మధ్యయుగాల ఐరోపా చరిత్రను గుర్తుకుతెచ్చే కోటలకు మసా అండ్ కరారా పెట్టింది పేరు.

## లద్దాక్, భారత్

హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహతాంగ్ కనుమ మీదుగా అటల్ టన్నెల్ గుండా సాగిపోతే కేంద్రపాలిత ప్రాంతం లద్దాక్ చేరుకుంటాం. ఆకాశాన్ని అందుకునే హిమాలయాలు, పాతాళాన్ని తాకే పర్వత లోయలు, సింధు, ష్యోక్ నదుల ఒయ్యారపు మలుపులు, బౌద్ధ మఠాలు, జడలబర్రెలు, కొండగొర్రెలు, నల్లమెడ కొంగలు, స్వచ్ఛమైన సరస్సులు లద్దాక్ ఆకర్షణలు. ఇక్కడి పెద్ద పట్టణమైన లేహ్‌లో మార్కెట్లు, మ్యూజియంలు, తొమ్మిది అంతస్తుల రాజభవనం చూడదగిన ప్రదేశాలు.





## బ్రెసీలియా, బ్రెజిల్

దక్షిణ అమెరికా ఖండంలో పెద్దదేశం బ్రెజిల్ రాజధాని నగరం బ్రెసీలియా. ప్రణాళికా బద్ధంగా నిర్మించిన ఈ నగరం అధునాతనమైన తెల్లటి భవంతులకు తార్కాణం. బ్రెజిల్ దేశపు అధ్యక్షుడి నివాసం పలాసియో డ అల్వొరడా కొత్త రూపాన్ని సంతరించుకుని ఈ ఏడాది మళ్లీ ప్రారంభం కానుంది. ఆధునిక నగర ప్రణాళికకు నమూనాగా నిలిచే బ్రెసీలియా నగరానికి యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల జాబితాలో చోటు దక్కింది.

## యమగూచి, జపాన్

స్వచ్ఛమైన ఉద్యానవనాలు, ఐదు అంతస్తుల రూరికోజీ ఆలయ పగోడాకు ప్రసిద్ధి చెందిన నగరం యమగూచి. వందల ఏండ్ల చరిత్ర కలిగిన బౌద్ధ మందిరం రూరికోజి పగోడాను జపాన్ జాతీయ సంపదల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఇక నగరంలోని మలుపులు మలుపుల వీధులు యుద్ధ వ్యూహాన్ని అనుభూతికి తెస్తాయి.

## న్యూజిలాండ్

దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియాకు దగ్గరగా ఉన్న దేశం న్యూజిలాండ్. ఉత్తర, దక్షిణ న్యూజిలాండ్ ప్రధాన దీవులు కాగా,



చిన్నచిన్న దీవులు అనేకం ఉన్నాయి. క్రియాశీల అగ్నిపర్వతాలు, చూపు తిప్పుకోనివ్వని గుహలు, హిమనదాలతో ఏర్పడిన లోతైన సరస్సులు, అందమైన లోయలు, పొడవైన బీచ్‌లు, మంచుతో కప్పి ఉండే ఎత్తయిన పర్వతాలకు నిలయం ఈ దేశం. కివీ పక్షులు మరో ఆకర్షణ. న్యూజిలాండ్‌ను రోడ్డు ద్వారా వెళ్తూ చూడాలని పర్యాటకులు కోరుకుంటారు. కానీ రైలులో చుట్టేయడం గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇలా న్యూజిలాండ్‌ను తిరగడానికి 17 రోజులు పడుతుంది.

మావుయి, అమెరికా

అమెరికాకు చెందిన హవాయి దీవుల్లో భాగమే ఈ మావుయి ద్వీపం. పసిఫిక్ మహాసముద్రం ఓ వైపు.. కాలుష్యం జాడలు లేని స్వచ్ఛమైన బీచ్‌లు, కొబ్బరిచెట్లు, ఎత్తయిన పర్వతాలతో కూడిన 700 చదరపు కిలోమీటర్ల ద్వీపం ఇది. హాలియాకలా నేషనల్ పార్క్ ప్రత్యేక ఆకర్షణ. ఇక కామావుల్ స్టేట్ బీచ్‌లో ముఖానికి స్నార్కెల్ పెట్టుకొని సముద్ర గర్భాన్ని చూస్తూ ఈదులాడొచ్చు. బీచ్‌లో సేదదీరుతూ సముద్ర తాబేళ్లను చూస్తూ అవ్యక్తమైన ఆనందానుభూతికి లోనుకావొచ్చు.

## మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్ఫియర్ రిజర్వ్, మెక్సికో

ఉత్తర అమెరికా దేశం మెక్సికోలో సుమారు 1,40,000 ఎకరాల్లో విస్తరించిన అటవీ ప్రాంతం.. మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్ఫియర్ రిజర్వ్. శిశిరం వచ్చిందంటే సరి.. బహుదూరాల నుంచి వలసవచ్చిన కోట్లాది మోనార్క్ జాతి సీతాకోకచిలుకలు ఈ పార్కులో సందడిచేస్తాయి. ఈ వలస కాలంలోనే సీతాకోకచిలుకలు నాలుగు తరాలు పుట్టి మరణిస్తాయట. యునెస్కో వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఈ బయోస్ఫియర్ రిజర్వ్ మెక్సికో నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

## తెస్సాలోనికి, గ్రీస్

గ్రీస్ దేశంలో ఏజియన్ సముద్ర తీరంలో ఉన్న ఈ నగరం పర్యాటక ప్రియులు అత్యధికంగా తరలివచ్చే ప్రదేశాల్లో ఒకటిగా ప్రసిద్ధిచెందింది. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో 'గ్రీకువీరుడు' అలెగ్జాండర్ ద గ్రేట్ సోదరి తెస్సాలోనికి పేరుమీదుగా ఆమె భర్త కసాండర్ ఆఫ్ మాసిడోన్ స్థాపించాడు. ప్రాచీన గ్రీకుల కాలపు కట్టడాలు, బైజాంటైన్ సామ్రాజ్యం మొజాయిక్ చిత్రాలు, ఒట్టోమాన్ తురుష్కుల కాలపు కట్టడాలతో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక లక్షణాలతో అలరారుతున్న నగరం తెస్సాలోనికి.

## సింగపూర్

ఆసియా ఖండానికి చెందిన నగర దేశం సింగపూర్ నిజంగానే పర్యాటకుల స్వర్గధామం. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రాలను కలిపే మలక్కా జలసంధి ప్రాంతంలో భూమధ్య రేఖ సమీపంలో నెలకొన్న సింగపూర్‌లో%% మెరీనా బే బీచ్ ఇసుకతిన్నెలు, కళ్లు చెదరగొట్టే ఉద్యానవనాలు, కోలాహలంగా ఉండే ఆర్చర్డ్ రోడ్, మండాయ్ అభయారణ్యంలోని పక్షుల పార్కు, పులావు సెంటోసా ద్వీపాలు, సింగపూర్ నేషనల్ మ్యూజియం, ప్రపంచంలోనే అత్యంత అరుదైన మాంగ్రూవ్ అడవులకు నిలయమైన సుంగేయి బులోహ్ వెట్‌లాండ్ అభయారణ్యం ప్రధాన సందర్శన స్థలాలు.

## జెనీవా, స్విట్జర్లాండ్

ప్రకృతి అందాల దేశం స్విట్జర్లాండ్‌లో రెండో పెద్ద నగరం జెనీవా. అనేక అంతర్జాతీయ సంస్థలు ఈ నగరం కేంద్రంగా పనిచేస్తున్నాయి. చాక్లెట్లు, గడియారాలకు జెనీవా ప్రసిద్ధి. ఇక్కడ జెట్ డిఈఎయూ ఫౌంటెయిన్, పూల గడియారం ఎల్‌హార్లోగ్ ఫ్లూరీ, సెయింట్ పియర్ కేథడ్రెల్, ప్లేస్ డ్యు బోర్గ్‌డిఫోర్ తదితర ప్రదేశాలు దర్శనీయాలు. ఇక్కడికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీఈఆర్‌ఎన్ పరిశోధన కేంద్రం ప్రధాన ఆకర్షణ.

## పారిస్, ఫ్రాన్స్

ఫ్రాన్స్ రాజధాని నగరం పారిస్ ఫ్యాషన్‌కు, ఈఫిల్ టవర్‌కు పేరుగాంచింది. 2024 ఒలింపిక్స్, పారాలింపిక్ ఆటలపోటీలకు ఈ నగరం ఆతిథ్యం ఇస్తున్నది. ఈఫిల్ టవర్‌తోపాటు నోటర్ డామ్ కేథడ్రెల్, లోవర్ మ్యూజియం, ఢిల్లీలోని ఇండియా గేట్‌ను పోలినఆర్క్ ఆఫ్ ట్రయంఫ్, వర్సైయిల్స్ రాజభవనం, డిస్నీలాండ్ చూడదగ్గ స్థలాలు. సీన్ నదిపై నౌకా విహారం అదనపు ఆకర్షణ.

## బ్రూనీ ఐలాండ్, ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా టాస్మేనియా రాష్ట్రంలో పసిఫిక్ మహాసముద్రంలో నెలవైన ద్వీపం బ్రూనీ ఐలాండ్. ఉత్తర, దక్షిణ బ్రూనీ భూభాగాలను కలిపే ఇరుకైన భూసంధి ఇక్కడి ప్రధాన ఆకర్షణ. కుడిఎడమలుగా విస్తరించిన సముద్రం మధ్య రోడ్డు ప్రయాణం ఓ వర్ణించలేని అనుభూతి. ఈ ద్వీపాన్ని మొదటగా 1642లో నెదర్లాండ్స్ నావికుడు ఏబెల్ టాస్మాన్ గుర్తించాడు. గార్డెన్ సీడ్ బ్యాంక్‌లో విత్తనాలు సేకరించవచ్చు. దీనికోసం టాస్మేనియన్ వాకింగ్ కంపెనీ, రాయల్ టాస్మేనియన్ బొటానికల్ గార్డెన్ ఉమ్మడిగా వృక్షశాస్త్ర విజ్ఞానం పెంచుకునేందుకు మూడు రోజుల ట్రెకింగ్ సదుపాయం కల్పించాయి.

## లేక్ టోబా, ఇండోనేషియా

ఇండోనేషియా దేశం సుమత్రాలో 1,707 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించిన అగ్నిపర్వత సరస్సు లేక్ టోబా. సరస్సు మధ్యలో



పులావు సామోసిర్ ద్వీపం ఉంటుంది. సుమారు 70,000 సంవత్సరాల కింద అగ్నిపర్వత విస్ఫోటనం వల్ల ఈ సరస్సు ఏర్పడింది. పులావు సామోసిర్ బతక్ తెగ ఆదివాసుల సాంస్కృతిక కేంద్రం. కొన్ని రోజులపాటు అడవిలో అలా ప్రశాంతంగా తిరిగి రావాలనుకునే వారికి గొప్ప పర్యాటక ప్రదేశం లేక్ టోబా. అయితే, సరస్సులో నీటి నాణ్యత ఒక్కో దగ్గర ఒకోలా ఉంటుంది. స్థానికులను అడిగి అనువైన చోట మాత్రమే లోపలికి అడుగుపెట్టాలి. ఈ సరస్సులోని నీరు అసహాన్ నది గుండా మలక్కా జలసంధిలో కలిసిపోతుంది.

## సావో నేషనల్ పార్క్, కెన్యా

ఆఫ్రికా ఖండ దేశం కెన్యాలో 22,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన అభయారణ్యం సావో నేషనల్ పార్క్. ప్రపంచంలో అతిపెద్ద జాతీయ ఉద్యానవనాల్లో ఇది ఒకటి. ఆఫ్రికా ఏనుగులు, సింహాలు, వివిధ రకాల కోతులు, అడవి దున్నలు, ఖడ్గమృగాలు, నీటి ఏనుగులు, హార్టెబీస్ట్ అనే జింకలు, జిరాఫీలు, జీబ్రాలు, వందలాది పక్షిజాతులతో సావో నేషనల్ పార్క్ సందర్శకులకు కనువిందు చేస్తుంది.

## పాసాడెనా, అమెరికా

కాలిఫోర్నియా రాష్ట్రంలో లాస్ ఏంజెల్స్ కౌంటీలో కొలువైన నగరం పాసాడెనా. సెయింట్ గాబ్రియెల్ పర్వతాల నేపథ్యంతో ఈ నగరం చూడముచ్చటగా ఉంటుంది. దీన్ని 1874లో థామస్ బి. ఇలియట్ స్థాపించాడు. పాసాడెనా అంటే 'లోయకు కిరీటం' అని అర్థం. చుట్టుపక్కల ఉన్న జలపాతాలు, ఏంజెలిస్ నేషనల్ పార్కు పాసాడెనాకు ప్రత్యేక ఆకర్షణలు.

## బాజ్ ఎన్‌వావ్‌జో ఇటా కుక్వేని, అమెరికా

అరిజోనా రాష్ట్రంలో భౌగోళిక అద్భుతం గ్రాండ్ కాన్యాన్ పరిసరాల్లో నెలకొంది. దీన్ని గత ఏడాది ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జాతీయ స్మారకంగా ప్రకటించారు. తొమ్మిది లక్షల ఎకరాల్లో విస్తరించిన బాజ్ ఎన్‌వావ్‌జో పీఠభూములు, కాన్యాన్లు, ఇతర భౌగోళిక అద్భుతాలతో వావ్ అనిపిస్తుంది. 3,000 వరకు సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యం ఉన్న స్థలాలు దీని సొంతం. ఆధ్యాత్మికంగానూ ప్రాధాన్యం కలిగిందే. సిందూరపు రంగు పర్వత భాగాలు, ఇతర వన్యప్రాణులు కనువిందు చేస్తాయి.

## వాలెన్షియా, స్పెయిన్

స్పెయిన్‌లో మధ్యధరా సముద్ర తీరంలో నెలకొన్న నగరం. 2,100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన నగరం వాలెన్షియా. ద సిటీ ఆఫ్ హండ్రెడ్ బెల్ టవర్స్ అని ఈ నగరానికి మారుపేరు. ఈ స్తంభాలలో మిగులెటె టవర్, టవర్ ఆఫ్ సాంటా కాటలినా ప్రసిద్ధిచెందినవి. నగరం మధ్యలో ఉన్న లా సియో కేథడ్రెల్ కూడా సందర్శనీయ స్థలమే. మధ్యయుగాలకు చెందిన వాలెన్షియా రాజుల కట్టడాలు ఆశ్చర్యపరుస్తాయి. ఎన్నో ఉద్యానవనాలు, ఆర్ట్ మ్యూజియంలు, సిరామిక్స్‌కు వాలెన్షియా పెట్టిందిపేరు. కన్ను ఆకారంలో ఉండే ఎల్‌హెమిస్‌ఫెరిక్, నీళ్లలో ఉండే ఎల్‌ఓషనోగ్రఫిక్ సిటీ కూడా చూడదగినవే. నడుస్తూనే వాలెన్షియాను చుట్టేయవచ్చు.

## సాలార్ డి ఉయుని, బొలీవియా


దక్షిణ అమెరికా దేశమైన బొలీవియాలో ఆండీస్ పర్వతాల్లో 12,000 అడుగుల ఎత్తులో నెలకొన్న ఉప్పు నీటి సరస్సు సాలార్ డి ఉయుని. ఆల్టిట్యూడ్ సిక్‌నెస్‌కు గురయ్యే ప్రమాదం పొంచి ఉన్న సాలార్ డి ఉయునికి ప్రయాణించడం సాహసమే. పురాతన సరస్సులు ఎండిపోవడంతో కేవలం లవణాలు మాత్రమే మిగిలిపోయిన నేల ఇది. 10,000 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన తెల్లటి ఉప్పునేల మీద సర్‌సర్‌మని మన అడుగుల సవ్వడి తప్ప మరే శబ్దం వినిపించదు.

## ఔరికా లోయ, మొరాకో

మధ్యధరా, అట్లాంటిక్ మహాసముద్రాల్ని ఆనుకుని ఉన్న మొరాకో దేశంలో అట్లాస్ పర్వతాలు ఉన్నాయి. వీటిలోభాగమే ఔరికా లోయ. ఎత్తయిన అట్లాస్ పర్వతాల మధ్య మలుపులు తిరిగే ఔరికా నది వల్లే ఈ ప్రాంతానికి ఈ పేరు. సెట్టి %-% ఫత్మా అనే గ్రామం దగ్గర్లో.. ఏడు జలపాతాల కలయికగా ఔరికా జలపాతాలు ఉంటాయి. సంప్రదాయ అమాజిగ్ ఇండ్లు కూడా సందర్శనీయ స్థలాలే.

## క్రేటర్స్ ఆఫ్ మూన్, అమెరికా

అమెరికాలోని ఇడాహో రాష్ట్రంలో అగ్నిపర్వత పేలుళ్లు, లావా ప్రవాహం వల్ల ప్రత్యేకతను సంతరించుకున్న ప్రాంతం. దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో విస్తరించిన క్రేటర్స్ ఆఫ్ మూన్‌ను అమెరికా ప్రభుత్వం 1924లో జాతీయ ప్రాధాన్యంగల ప్రాంతంగా ప్రకటించింది. అగ్నిపర్వత పేలుళ్ల వల్ల ఏర్పడిన ఎగుడు దిగుళ్లతో ఈ ప్రాంతం అచ్చంగా చందమామ ఉపరితలాన్ని గుర్తుకుతెస్తుంది. అందుకే 'క్రేటర్స్ ఆఫ్ మూన్' అని పేరుపెట్టారు. లావా ప్రవాహం గడ్డకట్టి ఉంటుంది కాబట్టి, ఇక్కడ వృక్షాలు అంతగా కనిపించవు. వర్షపాతం కూడా తక్కువే. అయినా, లావాతో గట్టిపడిన పగుళ్లలో నీళ్లు నిల్వ ఉంటాయి. స్నేక్ నది ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తుంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక





# హరిహరవీరమల్లులో కొన్ని సీన్ల తొలగింపు

దాదాపు అయిదేళ్ల చిత్రీకరణ తర్వాత.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన.. 'హరిహర వీరమల్లు' భారీ అంచనాల మధ్య ఈనెల 24న థియేటర్లలో విడుదలైంది. ఈ పాన్ఇండియా మూవీ ఇప్పటివరకు దేశవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.75 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమాలో కొన్ని సన్నివేశాల్లో వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌లు సరిగా లేవని సోషల్ మీడియా వేదికగా చర్చ జరుగుతోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఆ చిత్ర బృందం అలాంటి కొన్ని సీన్లను సినిమాలోంచి తొలగించింది. హీరో, అతడి అనుచరులు కొండ అంచున గుర్రాలపై స్వారీ చేసే సీన్‌ను కుదించారు. అలాగే జెండా సన్నివేశాన్ని పూర్తిగా తొలగించారు. పవన్ బాణాలు సంధించే యాక్షన్ సీన్‌లో చిన్నచిన్న మార్పులు చేశారు. క్లైమాక్స్ నిడివి కూడా బాగా తగ్గింది. ఇలా మొత్తంగా 10 నుంచి 15 నిముషాల ఫుటేజీని సినిమా నుంచి తొలగించారు. ప్రస్తుతం థియేటర్లలో ఈ సవరించిన వెర్షనే ప్రదర్శితమవుతోంది. అయితే ఈ సన్నివేశాల తొలగింపు గురించి చిత్రబృందం ఎలాంటి ప్రకటనా చేయలేదు.








# విఎఫెక్స్ పనుల్లో విశ్వంభర

## సెప్టెంబర్‌కు విడుదల అనుమానమే?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ దర్శకుడు వసిష్ఠ మల్లిడి డైరెక్షన్





లో వస్తున్ సోషియో ఫాంటాషి సినిమా 'విశ్వంభర'. చిరు సరసన కోలీవుడ్ స్టార్ బ్యూటీ- త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. వంశి ప్రమోద్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. అనుకోని కారణాల వలన షూటింగ్ డిలే అవుతూ వస్తున్న ఈ సినిమా స్పెషల్ సాంగ్ షూటింగ్ ను ఇటీవల ఫినిష్ చేసారు. మౌని రేయ్ చిరు సరసన స్టెప్పులేస్తోంది. దాంతో షూటింగ్ మొత్తం పూర్తిఅయింది. ఎప్పుడో విడుదల కావాల్సిన విశ్వంభర విఎఫెక్స్ వర్క్ కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. విశ్వంభర రిలీజ్ కు వచ్చిన నెగిటివ్ కామెంట్స్ ను దృష్టిలో పెట్టుకుని రీ వర్క్ చేస్తున్నారు. దాదాపు రూ. 75 కోట్లు- విఎఫెక్స్ కోసం ఖర్చు పెడుతోంది. ఇదిలా ఉండగా విఎఫెక్స్ వర్క్ ఆగస్టు చివరి నాటికి ఫినిష్ అవుతుందని సెప్టెంబర్ 25 న విశ్వంభర రిలీజ్ అని టాలీవుడ్ లో వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ ఇప్పటికే అదే డేట్ కు బాలయ్య - బోయపాటిల అఖండ 2, పవర్ స్టార్ ఓజీ రెడీ గా ఉన్నాయి. దాంతో ఆ రెండు సినిమాలతో పోటీ- ఎందుకు అందుకున్నారో ఏమో విశ్వంభరను మరోసారి వాయిదా వేసేందుకు రెడీ అయ్యారు. విశ్వంభర సెప్టెంబర్ రేస్ నుండి తప్పుకుని డిసెంబరుకు వెళ్తోంది.



# అమెజాన్‌లో 8నుంచి అరేబియా కడలి స్ట్రీమింగ్

సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సిరీస్ 'అరేబియా కడలి' ఓటిటి వేదికగా విడుదలవుతోంది. సూర్యకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీకి స్టార్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దీనికి రైటర్‌గా పని చేయడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరించారు. దీంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అమెజాన్‌లో ఆగస్టు 8 నుంచి అందుబాటులోకి రానున్నట్లు- తెలిపింది. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానున్నట్లు- అమెజాన్ ప్రైమ్ తెలిపింది. 'కాలానికి అందరూ సమానమే. అందరూ ఒడుదొడుకులను ఎదుర్కోవాల్సిందే' అంటూ పోస్టర్‌ను పంచుకుంది. రెండు గ్రామాలకు చెందిన కొందరు మత్స్యకారులు అనుకోకుండా బార్డర్ క్రాస్ చేస్తారు. దీంతో వాళ్లను విదేశీ జైల్లో బంధిస్తారు. అక్కడినుంచి వాళ్లు ఎలా బయటకు వచ్చారనే కథాంశంతో ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఇది రూపొందింది. 2024లోనే దీని చిత్రీకరణ ప్రారంభించారు. అయితే ఇటీవల ఇదే కథాంశంతో కొన్ని చిత్రాలు రూపొందినప్పటికీ ఈ కథ ఒరిజినల్ అని సంస్థ పేర్కొంది. ఇందులో సత్యదేవ్ సరసన ఆనంది నటించారు.




# మాస్ ఎమోషనల్ డ్రామాగా పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్నతాజా చిత్రం 'పెద్ది' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆర్ఆర్ఆర్ తర్వాత 'గేమ్ ఛేంజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చరణ్ ఈ చిత్రంతో నిరాశపరిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఫెయిల్యూర్‌ను మరిచిపోయేలా, ఓ మాస్ ఎమోషనల్ డ్రామాతో వస్తున్నాడు చరణ్. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కోసం మరో డెప్త్ ఉన్న క్యారెక్టర్ డిజైన్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు పెద్ది సినిమాను స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిస్తున్నారు. క్రికెట్, కబడ్డీ, కుస్తీ వంటి స్థానిక ఆటల నేపథ్యంలో సినిమా సాగనుందని సమాచారం. చరణ్ ఇందులో 'ఆట కూలీ' పాత్రలో కనిపించనున్నట్టు టాక్. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. చరణ్ గెటప్ కూడా మరీ డిఫరెంట్‌గా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ సినిమాకు మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవల రామ్ చరణ్ న్యూ బల్కీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్‌ను ఆగస్టు 25, 2025, వినాయక చవితి సందర్భంగా విడుదల చేయనున్నారట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. గ్లింప్స్ మూవీపై అంచనాలు పీక్స్‌కి తీసుకెళ్లగా, ఇప్పుడు ఏఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో రూపొందుతున్న సాంగ్స్ అభిమానులకి పూనకాలు తెప్పించడం గ్యారెంటీ- అంటున్నారు. పెద్ది' సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



# సెహ్వాగ్‌ను అధిగమించి కేఎల్ రాహుల్ కొత్త రికార్డు

భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ నాల్గవ టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ తరఫున శుభ్‌మన్ గిల్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా సెంచరీలతో మెరిశారు. అయితే, కేఎల్ రాహుల్ మాత్రం నర్వస్ 90స్ కు బలయ్యాడు. దాదాపు 8 ఏళ్ల తర్వాత రాహుల్ టెస్ట్ క్రికెట్‌లో 90 పరుగుల వద్ద ఔటవడం ఇదే తొలిసారి. అయినప్పటికీ, ఈ ఇన్నింగ్స్‌లో అతను చాలా రికార్డులను తన పేరు మీద రాసుకున్నాడు.క్రికెట్‌లో 'నర్వస్ 90స్' అంటే, ఒక బ్యాట్స్‌మెన్ 90 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసి, సెంచరీకి చేరువలో ఔటవడాన్ని సూచిస్తుంది. ఆదివారం ఇంగ్లాండ్‌తో జరిగిన నాలుగో టెస్ట్ ఐదవ రోజున, రాహుల్ 90 పరుగుల వద్ద బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. దీనికి ముందు అతను 8 ఏళ్ల క్రితం 90 పరుగుల వద్ద ఔటయ్యాడు. 2017 మార్చిలో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఇది జరిగింది.ఆదివారం కేఎల్ రాహుల్ ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో తన మూడో సెంచరీని కోల్పోయాడు. అతను మొదటి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో, మూడో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌లలో అతను 511 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ టెస్ట్ సిరీస్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేయడం తన కెరీర్‌లో ఇదే మొదటిసారి.కేఎల్ రాహుల్ సేనా దేశాలైన దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్,




ఆస్ట్రేలియాలో ఓపెనర్‌గా అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో వీరేంద్ర సెహ్వాగ్‌ను అధిగమించాడు. రాహుల్ ఇప్పుడు ఈ దేశాలలో ఆడిన 48 ఇన్నింగ్స్‌లలో 1782 పరుగులు చేశాడు. ఈ సమయంలో రాహుల్ 6 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు సాధించాడు. సెహ్వాగ్ సేనా దేశాలలో 1574 పరుగులు చేశాడు.శుభ్‌మన్ గిల్?తో కలిసి కేఎల్ రాహుల్ మూడో వికెట్‌కు 188 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో వారు 417 బంతులు ఎదుర్కొన్నారు. ఇంగ్లాండ్‌లో ఒక భాగస్వామ్యంలో అత్యధిక బంతులు ఎదుర్కొన్న రికార్డు ఇది. ఇంతకు ముందు ఈ రికార్డు రాహుల్ ద్రవిడ్, సంజయ్ మంజ్రేకర్?ల పేరు మీద ఉంది. వారు 2002లో లీడ్స్ టెస్ట్‌లో 405 బంతులు ఎదుర్కొని 170 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.ఇది కాకుండా శుభ్‌మన్ గిల్, రాహుల్ కలిసి మరో కొత్త రికార్డును సృష్టించారు. ఈ సిరీస్‌లో ఇద్దరూ 500 కంటే ఎక్కువ పరుగులు చేశారు. ఒక టెస్ట్ సిరీస్‌లో భారత్ తరఫున ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లు 500 కంటే ఎక్కువ పరుగులు చేయడం ఇది రెండోసారి. దీనికి ముందు 54 ఏళ్ల క్రితం సునీల్ గవాస్కర్(774 పరుగులు), దిలీప్ సర్దేశాయ్(642 పరుగులు) వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో ఈ ఘనత సాధించారు.




# మామ.. ఆఖరి మ్యాచ్ గెలవండి

## టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్

ఇంగ్లాండ్‌తో ఆఖరి టెస్ట్‌లో విజయం సాధించాలని టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ సహచర ఆటగాళ్లను కోరాడు. దేశం కోసం గెలుద్దామని పిలుపునిచ్చాడు. ఆదివారం ముగిసిన నాలుగో టెస్ట్‌ను అద్వితీయమైన పోరాటంతో టీమిండియా డ్రా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ రిషభ్ పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ షాట్ ఆడే ప్రయత్నంలో బంతి అతని కుడి పాదానికి బలంగా తాకింది. దాంతో పంత్ కుడికాలి చివరి వేలికి ఫ్రాక్చర్ అయ్యింది. ఈ గాయంతోనే తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన పంత్.. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్



చేసేందుకు సిద్ధమయ్యాడు. కానీ జడేజా-వాషింగ్టన్ సుందర్ ఆ అవసరం రాకుండా ఆడి మ్యాచ్‌ను డ్రా ముగించారు. తీవ్రంగా గాయపడిన పంత్.. ఆఖరి టెస్ట్‌కు దూరమయ్యాడు. అతనికి 6 వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు.ఈ క్రమంలోనే నాలుగో టెస్ట్ అనంతరం టీమిండియా ఆటగాళ్లను ఉద్దేశించి రిషభ్ పంత్ మాట్లాడాడు. 'నా జట్టుకు ఒకే ఒక్క సందేశం ఇస్తున్నా. మామ మనం గెలుద్దాం. దేశం కోసం విజయం సాధిద్దాం. వ్యక్తిగత లక్ష్యం కంటే జట్టు కోసం ఆడుదాం. నేను వ్యక్తిగత ప్రదర్శనల కంటే జట్టుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తా. నా సహచర ఆటగాళ్లంతా ఇలాంటి సమయంలో అండగా ఉండటం బాగుంది. దేశం కోసం ఆడేటప్పుడు జట్టు ఒత్తిడిలో ఉన్నా సరే ప్రతీ ఒక్కరూ మద్దతు ఇస్తారు. అలాంటి భావోద్వేగాలను వివరించడం చాలా కష్టం. నా దేశం తరఫున ఆడడాన్ని ఎప్పుడూ గర్వంగానే భావిస్తా.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు.రిషభ్ పంత్‌పై టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ ప్రశంసల జల్లు కురిపించాడు. పంత్‌ను ఎంత పొగిడినా తక్కువేనన్నాడు. 'నేనెప్పుడూ వ్యక్తిగత ప్రదర్శనల గురించి మాట్లాడను. నాకు అది నచ్చదు. కానీ మాంచెస్టర్ టెస్ట్‌లో రిషభ్ పంత్ గాయంతో బ్యాటింగ్ చేసి జట్టుకు విలువైన పరుగులు అందించాడు. అతని పోరాటం రాబోయే తరాలకు స్ఫూర్తి. అతన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. అతన్ని ఎంత ప్రశంసించినా తక్కువే.'అని గంభీర్ చెప్పుకొచ్చాడు.




# నేనే కెప్టెన్‌గా ఉంటే బెన్ స్టోక్స్ తిక్క కుదుర్చేవాడిని

## మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం

ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆదివారం ముగిసిన నాలుగో టెస్ట్ చివర్లో బెన్ స్టోక్స్ వ్యవహరించిన తీరుపై అశ్విన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ ప్రవర్తన సరికాదని మండిపడ్డాడు. తానే టీమిండియా కెప్టెన్‌గా




ఉండి ఉంటే బెన్ స్టోక్స్ తిక్క కుదుర్చేవాడినని తెలిపాడు. డ్రాకు అస్సలు ఒప్పుకోకపోయేవాడినని, ఆఖరి 15 ఓవర్లు కూడా ఆడించేవాడినని తెలిపాడు. ఈ మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా అసాధారణ ప్రదర్శనతో టీమిండియా ఓటమి నుంచి గట్టెక్కింది.అద్వితీయమైన బ్యాటింగ్‌తో రాణించిన జడేజా, సుందర్‌ల సెంచరీలను అడ్డుకోవాలనే దురుద్దేశంతో బెన్ స్టోక్స్ నిర్ణీత సమయం కన్నా ముందే డ్రాకు ప్రతిపాదించాడు. అయితే ఈ విజ్ఞప్తికి భారత ఆటగాళ్లు నిరాకరించారు. దాంతో సహనం కోల్పోయిన బెన్ స్టోక్స్.. భారత ఆటగాళ్లను అవమానపర్చేలా మాట్లాడాడు. హ్యారీ బ్రూక్, బెన్ డకెట్ బౌలింగ్‌లో సెంచరీలు చేస్తారా? అని హేళన చేశాడు. ఈ మాటలు స్టంప్ మైక్‌లో రికార్డ్ అయ్యాయి. ఇంత హేళన చేసినా.. సహనం కోల్పోని జడేజా.. డ్రా అనేది తమ చేతుల్లో లేదని చెప్పాడు. ఇద్దరు సెంచరీలు పూర్తి చేసుకున్న అనంతరం భారత్‌కు డ్రాకు అంగీకరించడంతో మ్యాచ్ ముగిసింది. అయితే జడేజాపై కోపంతో బెన్ స్టోక్స్ అతనికి షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. అసహనం వ్యక్తం చేస్తూ షేక్ హ్యాండ్ ఇవ్వకుండా వెళ్లిపోయాడు. బెన్ స్టోక్స్ తీరుపై ఓ జర్నలిస్ట్‌తో మాట్లాడిన అశ్విన్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.'ద్వంద వైఖరి అనే పదాన్ని ఎప్పుడైనా విన్నారా? ఆ పదం అర్థం కావాలంటే నాలుగో టెస్ట్ ఆఖరి పది నిమిషాల ఆటను చూడాలి. ఇంగ్లండ్‌కు నిరాశ ఎదురైందని, భారత్‌కు అలాంటి ఫిలింగే కలగాలని కోరుకోవడం ఏంటి? హ్యారీ బ్రూక్ బౌలింగ్‌లో సెంచరీ చేస్తావా? అని స్టోక్స్ అన్నాడు. అసలు హ్యారీ బ్రూక్‌తో బౌలింగ్ ఎవడు చేయించమన్నాడు. స్టీవ్ హర్మిసన్, ఆండ్రూ ఫ్లింటాఫ్‌ను తీసుకొచ్చి వేయించు. ఎవరు వద్దన్నారు? హ్యారీ బ్రూక్‌తో బౌలింగ్ చేయించడం మీ తప్పు. భారత్‌ది కాదు.



# కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితి ఉందని ఎలా చెబుతారు

ఉగ్రవాదుల దాడికి ఎవరు బాధ్యులో చెప్పరా?

పహల్గామ్ దాడి ముమ్మాటికీ నిఘా వైఫల్యమే

సిందూర్‌పై చర్చలో ప్రియాంక విమర్శలు

న్యూఢిల్లీ,

జమ్మూకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని కేంద్రం చెబుతుండటంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అంతా సజావుగానే ఉంటే, శాంతి భద్రతలు నెలకొని ఉంటే పహల్గాం ఉగ్రదాడి ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో ప్రియాంక గాంధీ మాట్లాడారు. భారత సాయుధ బలగాల సేవలు, త్యాగాలను ప్రశంసించారు. జాతీయ భద్రతపై చెక్కుచెదరని వారి సంకల్పాన్ని కొనియాడారు. పహల్గాంలో పర్యాటకులను దారుణంగా చంపారని, వివరాలు అడిగి మరీ చంపారని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేశారు. భార్య కళ్లముందే శుభమ్ అనే వ్యక్తిని చంపేశారని అన్నారు. పహల్గాంలో పర్యాటకుల దగ్గర భద్రతా సిబ్బంది ఎందుకు లేరని సూటిగా ప్రశ్నించారు. పర్యాటకుల భద్రత కేంద్ర ప్రభుత్వానిది కాదా? అంటూ నిలదీశారు. ఇది నిఘా సంస్థల వైఫల్యం కాదా? అని ధ్వజమెత్తారు. పహల్గాం ఉగ్రదాడి బాధ్యత ఎవరిది? ప్రధాన మంత్రిదా? హోం మంత్రిదా? రక్షణ మంత్రిదా? నేషనల్ సెక్యూరిటీ- అడ్వయిజర్‌దా? ఎవరైనా రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. జాతీయ భద్రత విషయంలో తీవ్రలోపం జరిగిందన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించామని అమిత్‌షా చెబుతున్నారని, అయితే కశ్మీర్‌లో గతంలోనూ టీఎఆర్ఎఫ్ దాడులు చేసిందని గుర్తు చేశారు. టీఆర్ఎఫ్ వరుస దాడులు చేస్తుంటే కేంద్రం ఏం చేస్తోందన్నారు. రక్షణమంత్రి గంటసేపు సభలో చాలా విషయాలు మాట్లాడారని, కానీ ఒక పాయింట్ ప్రస్తావించలేదన్నారు. ఏప్రిల్ 12న పట్టపగలే ఉగ్రదాడి ఎలా, ఎందుకు జరిగిందో చెప్పలేదన్నారు. 2008 బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో టెర్రరిస్టులను చంపినందుకు సోనియా గాంధీ కంటతడిపెట్టారంటూ హోంమంత్రి అమిత్‌షా ఆరోపించడాన్ని ప్రియాంక గాంధీ తిప్పికొట్టారు. తన కుటుంబం కూడా వ్యక్తిగతంగా నష్టపోయిందన్నారు. ఉగ్రవాదుల చేతిలో తన తండ్రి ప్రాణాలు కోల్పోయినప్పుడు తన తల్లి కన్నీళ్లు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# పంత్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే

## టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌ను డ్రా చేసుకోవడంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ సంతోషం వ్యక్తం చేశాడు. భారత జట్టు అద్వితీయమైన పోరాటంతోనే ఇది సాధ్యమైందని కొనియాడాడు. గాయంతో బ్యాటింగ్ చేసిన రిషభ్ పంత్‌ను ఎంత పొగిడినా తక్కువేనన్నాడు. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అజేయ శతకాలతో చెలరేగి టీమిండియాను గట్టెక్కించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గౌతం గంభీర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. తమ ఆటగాళ్ల సెంచరీల ముందు డ్రా కోసం ప్రయత్నించిన బెన్ స్టోక్స్ తీరును తప్పుబట్టాడు. 'ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం గర్వంగా ఉంది. చాలా మంది మా జట్టును తక్కువ అంచనా వేసారు. కానీ మా ఆటగాళ్లు అద్భుతమైన పోరాటంతో ఓటమి నుంచి గట్టెక్కించారు. దేశం కోసం మా ఆటగాళ్లు పోరాడుతారు. శుభ్‌మన్ గిల్ ప్రతిభపై ఎలాంటి సందేహం అవసరం లేదు. క్రికెట్ గురించి తెలియని వారికే అతనిపై సందేహాలు ఉంటాయి. శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ ఏ మాత్రం భారం కాదు. రిషభ్ పంత్ కాలికి గాయమవ్వడంతో ఆఖరి టెస్ట్‌కు దూరమయ్యాడు. విరిగిన కాలుతో బ్యాటింగ్ చేసిన రిషభ్ పంత్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే. అతని పోరాటం రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుంది.'అని గంభీర్ తెలిపాడు. ఈ మ్యాచ్‌ను ముందుగానే డ్రా చేయాలని బెన్ స్టోక్స్ కోరడాన్ని గంభీర్ తప్పుబట్టాడు. ఇది సరైన చర్య కాదని, ఇంగ్లండ్ ఆటగాళ్లు కూడా సెంచరీలకు చేరువగా ఉంటే స్టోక్స్ డ్రాకు అంగీకరించేవాడా? అని ప్రశ్నించాడు. 'జడేజా, వాషింగ్టన్ సుందర్ అద్భుత బ్యాటింగ్‌తో సెంచరీలకు చేరువైనప్పుడు డ్రాకు ఎలా అంగీకరిస్తాం. బెన్ స్టోక్స్ అలా ఎలా అడుగుతాడు? ఇంగ్లండ్ ఆటగాళ్లే ఇలా సెంచరీకి చేరువగా ఉన్నప్పుడు అతను ఇలానే డ్రాకు ఒప్పుకునేవాడా? జడేజా, సుందర్ సెంచరీలు చేసుకోవడానికి పూర్తి అర్హులు. మేం ఎవర్నీ సంతోషపెట్టడానికి ఆడటం లేదు. జట్టు గెలుపు కోసం మాత్రమే ఆడుతున్నాం.'అని గంభీర్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా మాట్లాడకపోయినప్పటికీ.. జట్టులోని పేసర్లంతా ఫిట్‌గానే ఉన్నారని గంభీర్ స్పష్టం చేశాడు. ఆఖరి టెస్ట్‌లో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేయడమే తమ లక్ష్యమని చెప్పాడు.



# కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదు

ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనను తోసిపుచ్చిన మోడీ

ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలకు బుద్ధి చెప్పాం

సిందూర్‌లో త్రివిధ దళాలు సత్తా చాటాయి

కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసిన త్రివిధ దళాలు

ఆపరేషన్‌పై కాంగ్రెస్, విపక్షాల తీరు దారుణం

సైన్యం స్థయిర్యం దెబ్బతినేలా వ్యాఖ్యలు

హెడ్‌లైన్స్‌లో ఉండేలా చేస్తున్న వారికి ప్రజల్లో స్థానం లేదు

ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో ప్రధాని మోడీ సమాధానం

న్యూఢిల్లీ,



పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా పాత్రను లోక్‌సభ వేదికగా ప్రధాని మోడీ తోసిపుచా÷-చారు. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. ఇదే సందర్భంలో ప్రధాని మోదీ.. కాంగ్రెస్, విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాదులను మట్టిలో కలిపినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం, భారత సేనల శౌర్య, ప్రతాపాల ప్రదర్శన తర్వాత విజయోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. 140 కోట్ల భారతీయుల ఐక్యత, ఇచ్ఛాశక్తి ఫలాలతో భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో వాడీ వేడిగా జరిగిన చర్చకు సమాధానం గా ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో ఏ నేత కూడా మాకు చెప్పలేదు. మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. పాక్ భారీగా దాడి చేయబోతోందని ఆయన హెచ్చరించారు. పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు చెప్పా. పాక్‌కు ఎవరు సాయం చేసినా.. చూస్తూ ఊరుకొనేది లేదని చెప్పాం. పాక్ ఎలాంటి దాడి చేసినా మేం చూసుకుంటామని వాన్స్‌కు చెప్పాం. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెప్తామని జేడీ వాన్స్‌కు చెప్పాం. పాక్‌కు ఎవరు సహాయం చేసినా.. చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశాం. పాక్‌కు చిరకాలం గుర్తుండిపోయే సమాధానం ఇచ్చాం. పాక్ డీజీఎం అర్ధరాత్రి ఫోన్ చేసి దాడులు ఆపాలని బతిమాలితేనే ఆపరేషన్ సిందూర్ నిలిపివేశామని అన్నారు. ఈ ఆపరేషన్ సందర్భంగా త్రివిధ ధళాలకు సంపూర్ణ స్వేచ్ఛ నిచ్చామని మోదీ తెలిపారు. భారత సైన్యం పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిందని, ఊహలకు కూడా అందని విధంగా టెర్రరిస్టులను శిక్షించామని, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను మట్టిలోనే కలిపేశామని అన్నారు. ఏప్రిల్ 22న కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గాం దాడులు అన్నారు. ఈ దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టిలో కలుపుతామని ప్రతినబూనాం. ద్రోహులకు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని చెప్పాం. ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పాలని అఖిలపక్ష భేటీలోనూ చర్చించాం. పాక్ భూభాగంలోకి వెళ్లి ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేశాం. పాక్ ఎయిర్ బేస్‌లు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయి. అణుబాంబులు బెదిరింపులు చెల్లవని పాక్‌ను హెచ్చరించాం. 193 దేశాల్లో 190 దేశాలు ఆపరేషన్ సిందూర్‌ని సమర్థించాయి. పాక్‌కు కేవలం మూడు దేశాలే అండగా నిలిచాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను కాంగ్రెస్ మాత్రమే తప్పుపడుతోందని,స్వార్థ రాజకీయాల కోసం సైనికుల పరాక్రమాలను తక్కువ చేస్తోంది. తమ స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మోడీ మండిపడ్డారు. తద్వారా సైన్యం మనోస్థయిర్యాన్ని దెబ్బతీస్తున్నారు. మీడియా హెడ్‌లైన్లలో వచ్చేందుకు కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మీడియా హెడ్‌లైన్లలో ఉండొచ్చేమో గానీ.. ప్రజల మనస్సుల్ని గెలవలేరని అన్నారు. పాకిస్థాన్‌ను కాంగ్రెస్ వెనకేసుకురావడం దౌర్భాగ్యం. సర్జికల్ ÷-టస్ట్రైక్స్ట్ర విషయంలోనూ కాంగ్రెస్ నేతలు ఇలాగే మాట్లాడారు. పైలట్ అభినందన్ పాక్‌కు చిక్కినప్పుడూ ఇలాగే మాట్లాడారు. పాక్ నుంచి అభినందన్‌ను మోదీ ఎలా తెస్తారో చూస్తామన్నారు. మేం ఆయన్ను సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చాం. విపక్షాల తీరు చూసి దేశమంతా నవ్వుకుంటోంది. భారత రక్షణ దళాల శక్తి, సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉంది. భారత రక్షణ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. నేనెప్పుడూ భారత ప్రజల పక్షమే. భారతీయుల భావనలతో నా స్వరం మిళితం చేసుకొని ముందుకెళ్తున్నా. ఆపరేషన్ సిందూర్ సమయంలో నాపై నమ్మకం ఉంచినందుకు దేశ ప్రజలకు రుణపడి ఉన్నానని మోడీ అన్నారు. పాకిస్థాన్ మళ్లీ ఎలాంటి కుయుక్తులు చేసినా ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంని స్పష్టం చేశారు. పాక్ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా బదులిస్తాంఅని ప్రధాని మోదీ హెచ్చరించారు. పహల్గాం దాడి ఉగ్రవాదులను సైతం మట్టు-బెట్టామన్నారు. ఆపరేషన్ మహాదేవ్ చేపట్టి ఉగ్రవాదుల్ని ఏరివేస్తున్నట్లు- చెప్పారు.

# అఖిలపక్షంకన్నా ఎన్నికల ప్రచారమే ముఖ్యమా?

ఉగ్రవాదులను ఏరివేసామని అబద్దాలు ప్రచారం చేస్తారా

అబద్దాల కార్ఖానాలు ఏర్పాటు చేసిన బిజెపి


సిందూర్‌పై రాజ్యసభ చర్చలో ఖర్గే ఘాటు వ్యాఖ్యలు

నడ్డా అభ్యంతరం....విపక్షం డిమాండ్‌తో క్షమాపణలు

న్యూఢిల్లీ,

ఆపరేషన్ సిందూర్ పై రాజసభ్యలోనూ వాడీవేడీ చర్చ జరిగింది. ఈ క్రమంలో రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సభాపక్ష నేత జేపీ నడ్డా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తీవ్ర వాగ్వాదానికి కారణమైంది. దీంతో అధికార, విపక్ష సభ్యుల చప్పుళ్లతో సభ కొద్దిసేపు దద్దరిల్లింది. చివరకు తన వ్యాఖ్యలను నడ్డా వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పడంతో సభ సద్దుమణిగింది.

పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దాదాపు గంటపాటు- ప్రసంగించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీపైనా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖర్గే ప్రసంగం ముగిసిన వెంటనే స్పందించిన నడ్డా.. కాంగ్రెస్ అధ్యక్షుడు 'మానసిక సమతుల్యత' కోల్పోతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో నడ్డా చర్యలను తీవ్రంగా తప్పుపట్టిన విపక్షాలు క్షమాపణ చెప్పాలంటూ బల్లలు చరుస్తూ ఆందోళన చేపట్టాయి. అనంతరం ఖర్గే కూడా మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వంలో తాను గౌరవించే మంత్రుల్లో నడ్డా కూడా ఒకరని, అయినప్పటికీ తనపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. వెంటనే కేంద్ర మంత్రి నడ్డా స్పందిస్తూ.. ఇప్పటికే తన మాటలు వెనక్కి తీసుకున్నానని, క్షమాపణ కూడా చెప్పానని అన్నారు. నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ ఉన్న నాయకుడు. అందుకు భాజపానే కాదు దేశం మొత్తం గర్విస్తోందని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. ఖర్గే మాత్రం ఆయన స్థాయిని పట్టించుకోకుండా అభ్యంతరకరంగా మాట్లాడారని విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ తన పరిధిని దాటి ప్రధానిపై వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అవి ఆయన స్థాయికి తగినట్లు- లేవని, వాటిని రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరం ఉందని జేపీ నడ్డా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై ఉభయసభల్లో చర్చ జరుగుతుండగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో లేకపోవడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. తామంతా అఖిల పక్ష సమావేశంలో పాల్గొంటే ఆయన బీహార్‌లో రాజకీయ ర్యాలీలో పాల్గొన్నారని అన్నారు. ఇంతటి క్లిష్ట సమయంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం అవసరమా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటయ్యాయ్యాయని ఖర్గే తెలిపారు. తమరు ప్రభుత్వ రంగ కార్ఖానాలు కాదు.. అబద్ధపు కార్ఖానాలు ఏర్పాటు- చేశారని అన్నారు. కీలకమైన అంశంపై పార్లమెంటు లో చర్చ జరుగుతుంటే ప్రధాని నరేంద్రమోడీ సభలో లేరని, కీలకమైన చర్చను వదిలేసి బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిందని తెలియజేశారు. పార్లమెంటుకు రాకుండా ఎన్నికల ప్రచారానికి వెళ్లడమే దేశభక్తి అవుతుందా? అని ప్రశ్నించారు. పార్లమెంటు- సమావేశాలు నిర్వహించాలని అడిగితే మోడీ స్పందించలేదని, ఘటన జరిగిన 3 నెలల తర్వాత పార్లమెంటులో చర్చ పెట్టారని మండిపడ్డారు. విపక్షాలు పాకిస్థాన్ కు మద్దతు ఇస్తున్నాయని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అసత్యాలతో ఎక్కువకాలం ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. తాము ఎప్పుడూ పాకిస్థాన్ కు మద్దతు ఇవ్వలేదని, ఇవ్వబోము అని చెప్పారు. కాంగ్రెస్ దేశాన్ని నిర్మించిన పార్టీ.. కాంగ్రెస్ కు చాలా చరిత్ర ఉందని కొనియాడారు. పహల్గాం ఘటనతో సంబంధం లేని అంశాలను లేవనెత్తుతున్నారని, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని ధ్వజమెత్తారు. తాము మొదట నుంచి చెబుతున్నామని, ఉగ్రవాద సమస్య బిజెపి హయాంలో మూడింతలు అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాల మూలాలు దెబ్బతీస్తున్నట్లు- కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్ పర్యటనలో చెప్పారని అన్నారు. పాక్ ఉగ్రవాదులు పహల్గాం వరకు ఎలా వచ్చారని, పహల్గాం దాడికి 3 రోజుల ముందు ప్రధాని జమ్మూ పర్యటన రద్దు చేసుకున్నారని ఎద్దేవ చేశారు. ప్రధాని పర్యటన రద్దు చేసుకుంటారని.. పర్యాటకులను ఎలా అనుమతించారని నిలదీశారు. పహల్గాం దాడి కచ్చితంగా భద్రతా వైఫల్యమని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ అన్నారని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అన్నీ తన ఘనతగా చెప్పుకునే జవాబుదారీ మోడీ.. పహల్గాం ఘటనకు ఎందుకు బాధ్యత వహించరు? అని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. సైనికులు సాధించిన విజయాన్ని కూడా రాజకీయం చేయడం తగదని.. ఆపరేషన్ సిందూర్ లో భారత విజయంపై కాంగ్రెస్ కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించిందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలి... జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఎంత వేగంగా ఇల్లు పూర్తి చేస్తే, అంతే వేగంగా ప్రతివారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు జమ

అర్హులందరికీ విడతల వారిగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్






**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరతగతిన నిర్మాణాలు చేపట్టేలా వారిని అన్ని విధాలుగా అధికారులు సహకరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్ గ్రామంలో జిల్లా కలెక్టర్, ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన లబ్ధిదారులు చేపట్టిన ఇండ్ల నిర్మాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణం, పనులలో నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు సత్వరమే ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. వివిధ కారణాల వల్ల ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించలేకపోయిన లబ్దిదారులను కలిసి, వారికి ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక తోడ్పాటు గురించి వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశిత గడువు లోపు నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని, నిబంధనలకు అనుగుణంగా ఇండ్ల నిర్మాణాలు జరిగేలా అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అధికారును కలెక్టర్ ఆదేశించారు. ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులను జిల్లా కలెక్టర్ పలుకరించి, ఇంటి నిర్మాణానికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసుకోవాలని, వివిధ దశలను అనుసరిస్తూ వెంట వెంటనే డబ్బులను ఖాతాలో జమ చేయిస్తామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెరగాలని, మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండ్ అయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. శ్రావణ మాసంలో పెండింగ్ ఇండ్ల మార్కింగ్ పనులు కూడా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలు నియంత్రణలో ఉండేలా మండల స్థాయి కమిటీ పని చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మండలంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభమయ్యే విధంగా అధికారులు లబ్ధిదారులతో చర్చలు జరపాలని కలెక్టర్ తెలిపారు. నగదు సమస్య ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించేందుకు కార్యచరణ చేపట్టాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు క్యాప్చర్ చేస్తూ ఆన్ లైన్ లో నమోదు చేయాలని, లబ్ధిదారులకు ప్రభుత్వ తరఫు నుంచి ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు చూడాలని, మన దగ్గర పెండింగ్ ఉండకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, ఇసుక తీసుకెళ్ళేందుకు కూలీ, రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని, జిల్లాలో ఎక్కడైనా ఇసుక సరఫరా కోసం వసూలు చేస్తే అధికారుల దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఇవో దీక్షా రైనా, రఘునాథపాలెం తహసిల్దార్ శ్వేత, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో ఆరోగ్యకరమైన మొక్కలు పెంచడం లక్ష్యంగా చర్యలు... జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి







బ్లాక్ ప్లాంటేషన్ మొక్కల పెంపకానికి పటిష్ట కార్యాచరణ

వనమహోత్సవం విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి....

మేగా బ్లాక్ ప్లాంటేషన్ మొక్కల పెంపకానికి రఘునాథపాలెం మండలంలో అనువైన స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

భావితరాలకు పచ్చదనం ఇచ్చే మొక్కలు పెంచే వన మహోత్సవం కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రఘునాథపాలెం మండలం జింకల తండా గుట్ట వద్ద వన మహోత్సవం వంటి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుకోసం మేగా బ్లాక్ ప్లాంటేషన్ మొక్కల పెంపకానికి అనువైన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. గుర్తించిన స్థలంను ఎర్రమట్టితో చదునుచేసి మంత్రులతో విఐపి మెగా ప్లాంటేషన్ లో మొక్కలు నాటే కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, వన మహోత్సవం కార్యక్రమం క్రింద నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వన మహోత్సవం క్రింద బ్లాక్ ప్లాంటేషన్ కొరకు జిల్లాలో గుర్తించిన స్థలాల లెవెలింగ్, గుంతల తవ్వకం పనులు, అవసరమైన మొక్కలు, మంత్రి వర్యులచే మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను ప్రణాళికా ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నర్సరీలో అందుబాటులో ఎన్ని ఎత్తైన మొక్కలు ఉన్నాయి, బయట నుంచి ఎన్ని తెప్పించుకోవాలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బ్లాక్ ప్లాంటేషన్ కోసం గుర్తించిన స్థలాలలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకరమైన, ప్రజలకు ఉపయోగపడే మొక్కలు పెంచాలని అన్నారు. నాటిన మొక్కలకు రెగ్యులర్ గా నీళ్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఎంపీడివో, అటవీ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఎపిలో ఇక రేషన్ మరింత స్మార్ట్

క్యూఆర్ కోడ్‌తో చిన్నిసైజులో కార్డులు

ఆగస్టు 25 నుంచి 31 వరకు స్మార్ట్ కార్డులు పంపిణీ

రేషన్ పంపిణీలో ఇక మరింత పారదర్శకత

మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

**అమరావతి,**

రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి 31 వరకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు– ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అక్రమాలకు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఈ కార్డులను రూపొందించినట్లు– తెలిపారు. మంగళవారం మీడియాతో మంత్రి మాట్లాడారు. కొత్తగా 9లక్షల మందికిపైగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నాం. రాష్ట్రంలోని 29,796 రేషన్ షాపుల్లో ప్రతినెలా 1 నుంచి 15 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్యం 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 వరకు రేషన్ సరఫరా చేస్తున్నాం. ఐదేళ్లలోపు, 80 ఏళ్లు దాటిన వారికి ఈకేవైసీ అక్కర్లేదని మంత్రి నాదెండ్ల తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేషన్ కార్డులని పంపిణీ చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం, ఏపీ ప్రభుత్వం 40శాతం కార్డులను భరిస్తున్నాయని వెల్లడించారు. 4.72 శాతం రేషన్ కార్డు దరఖాస్తులు తిరస్కరించామని చెప్పుకొచ్చారు. ఏపీ వ్యాప్తంగా రేషన్ కార్డుల సంఖ్య కోటి 40 లక్షల 96వేల 86 మందికి కార్డులు ఉన్నాయని వివరించారు. పాత విధానాన్ని మార్చి స్మార్ట్ రేషన్ కార్డులు ఇచ్చేందుకు డిజిటలైజ్ చేశామని వెల్లడించారు. ఈ కార్డులపై ఎక్కడ కూడా నాయకుల ఫొటోలు ఉండకూడదని డిజైన్ చేశామని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫొటోలు మాత్రమే రేషన్ కార్డులో ఉంటాయని.. వీటిని డెబిట్, క్రెడిట్ కార్డు సైజుల్లో ఇవ్వబోతున్నామని ప్రకటించారు. కుటుంబ సభ్యుల వివరాలు, కార్డునెంబర్ బాగా కనిపించేలా రూపొందించామని వెల్లడించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ట్రాన్సెక్షన్ జరిగిన వెంటనే సెంట్రల్ ఆఫీసులో తెలుస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ కార్డులు అన్ని ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ఆగస్టు 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఈ కార్డులు అందిస్తామని ప్రకటించారు. జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇస్తారని, రాష్ట్రస్థాయిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ– సీఎం పవన్



కల్యాణ్ ఈ కార్డులు పంపిణీ చేస్తారని వెల్లడించారు. 94శాతం మందికి ఈ కేవైసీ చేశామని తెలిపారు. 65 సంవత్సరాల దాటిన వృద్ధులకు ప్రతి నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య సరుకులు హోం డెలివరీ చేస్తామని వెల్లడించారు. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలో మినహా అన్నిచోట్ల పంపిణీ బాగానే జరుగుతోందని చెప్పుకొచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఇబ్బందులను స్వయంగా తామే వెళ్లి పరిష్కరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దీపం పథకంలో ఎలాంటి లోపం లేకుండా మూడు ఆయిల్ కంపెనీలతో ప్రతి వారం సమీక్షలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. రెండో విడతలో దీపం పథకంలో ఈరోజు వరకూ 93లక్షల 86వేల మందికి దీపం పథకం డెలివరీలు పంపిణీ చేశామని తెలిపారు. దీపం–2 పథకాన్ని లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీ లోపు వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై డైరెక్ట్‌గా వినియోగదారుల ఖాతాలో డబ్బులు జమ చేయడానికి 4281 మంది లబ్ధిదారులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా డిజిటల్ వ్యాలెట్ ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ దీపం పథకాన్ని 30శాతం మంది ఉపయోగించుకున్నారని గుర్తుచేశారు. 2580 మంది లబ్ధిదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. దీపం పథకంలో 86వేల మంది లబ్ధిదారుల అకౌంట్లు– సక్రమంగా లేకపోవడంతో వారికి డబ్బులు పడలేదని.. వారి వివరాలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 4516 ట్రాన్సెక్షన్‌లు మాత్రమే ఫెయిల్ అయ్యాయని తెలిపారు. వేర్వేరు బ్యాంకు అకౌంట్లు–, ఫోన్ నెంబర్‌లు వేరే ఉండటంతో డబ్బులు పడలేదని చెప్పుకొచ్చారు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ కింద గ్యాస్ ఏజెన్సీకి మాత్రమే ఆ కూపన్ చెల్లుతుందని... దీంతో వ్యాలెట్‌లోని పైసలు వేరే అవసరాలకు వాడటానికి వీలుండదని స్పష్టం చేశారు. 86 వేల మంది లబ్ధిదారులని గుర్తించడం చాలా కష్టం అయిందని... అయితే అర్హత ఉన్నవారికి నూటికి నూరుశాతం అందజేస్తామని హామీ ఇచ్చారు. చివరి నిమిషంలో గ్యాస్ బుకింగ్ చేసుకోవడం వల్ల కూడా డబ్బులు పడే అవకాశం లేదని... కాబట్టి ముందే బుక్ చేసుకోవాలని సూచించారు. ఏపీలో అన్ని సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ఓ అర్హతగా ఉందని తెలిపారు. ప్రస్తుతం డెత్ కేసుల వరకే ఇప్పుడు తొలగిస్తున్నామని.. ఇప్పటి వరకూ ఏపీలో 3 లక్షల 56 మంది వరకూ డెత్ కేసులుగా గుర్తించి వాటిని తొలగించామని వివరించారు. వలంటరీగా కార్డులు సరెండర్ చేయమని అడగటంతో 12 నుంచి 13 వందల మంది ముందుకు వచ్చారని పేర్కొన్నారు. అసెంబ్లీ పిటిషన్‌ల కమిటీ– ఇచ్చిన సిఫార్సులని కమిషనర్ తన దృష్టికి తీసుకువచ్చారని... ఈ విషయంపైనా ఆలోచిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పుకొచ్చారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కాబట్టే హరిహర వీరమల్లు సినిమాను తాము ప్రమోట్ చేస్తామని.. అది తమ బాధ్యత అని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. తమ సినిమాలను తాము ప్రమోట్ చేయకుండా.. వారి సినిమాలను ప్రమోట్ చేస్తామా అని ప్రశ్నించారు. సినిమాకు ప్రమోషన్ చేస్తే తప్పేంటని నిలదీశారు. తమ సినిమాని తాము ప్రమోషన్ చేసుకుంటామని స్పష్టం చేశారు. సినిమా ప్రమోషన్‌కి మంత్రుల స్థాయి అనేది అనవసరమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# సరస్వతీ పవర్ షేర్ల బదిలీ కుదరదు

## జగన్‌కు భారీ ఊరట

**హైదరాబాద్,**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు భారీ ఊరట లభించింది. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ వాటాల బదిలీపై జగన్ వేసిన పిటిషన్‌ను అనుమతించింది. విజయలక్ష్మి, షర్మిలకు వాటాలు బదిలీ నిలుపుదల చేయాలని జగన్ పిటిషన్ పై విచారణ జరిపిన ధర్మాసనం.. జగన్ వాదనలతో ఏకీభవించింది. విజయలక్ష్మి, షర్మిలకు బదిలీ అయిన వాటాలను నిలుపుదల చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును విజయమ్మ, షర్మిల హైకోర్టు లో సవాల్ చేసే అవకాశం ఉన్నట్లు– తెలుస్తోంది. కాగా గతంలో తన అన్న వదిన కలిసి తమకు సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌లో రావాల్సిన వాటాలను ఇవ్వడం లేదని షర్మిల, విజయలక్ష్మి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.



# సైన్యం చేతులు కట్టేసి..పాక్‌తో సయోధ్య

ఉగ్రదాడులకు దీటుగా సమాధానం చెప్పడంలో విఫలం

దమ్ముంటే ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాలి

ఆపరేషన్ సిందూర్ చర్చపై రాహుల్

**న్యూఢిల్లీ,**

ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికుల చేతులు కట్టేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడిందని విమర్శించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసిందన్నారు. 'ఆపరేషన్ సిందూర్ 'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. పహల్గాం ఉగ్రదాడిని పాకిస్థాన్ కుట్రపన్నిన క్రూరమైన ఘటనగా పేర్కొన్నారు. సాయుధ దళాలను ఉపయోగించాలనుకుంటే.. బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి. వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ.. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను దాయాదికి వెల్లడించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ ప్రారంభమైందని.. 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్ చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారన్నారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారని రాహుల్ గాంధీ విమర్శించారు.

పాక్ విజ్ఞప్తి మేరకు యుద్ధాన్ని ఆపామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు.. భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 29 సార్లు చెప్పుకొన్నారు. ఇందిరా గాంధీలా ధైర్యం ఉంటే.. ట్రంప్ 'అబద్ధాలకోరు' అని, భారత్ యుద్ధవిమానాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రధాని మోదీ లోక్‌సభలో ప్రకటించాలని రాహుల్ డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయని, తాను పహల్గాం దాడి బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు– తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ప్రభుత్వానికి మద్దుతు తెలిపాయని, ఇందుకు తాము గర్విస్తున్నామని రాహుల్ గాంధీ అన్నారు. హహల్గాం ఉగ్రదాడిలో పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపారని రాహుల్ అన్నారు. ఉగ్రదాడిలో పిల్లలు, యువకులు, వృద్ధులు చనిపోయారని, భార్య కళ్ల ముందే భర్తను కాల్చి చంపేశారని ఆవేదన వ్యక్తం చేసారు. విపక్షాలుగా దేశ భద్రత విషయంలో తాము ప్రభుత్వానికి అండగా నిలిచామని, ఆపరేషన్ సిందూర్‌కు ముక్తకంఠంతో మద్దతు తెలిపామని చెప్పారు.

# అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకునేది లేదు ..... ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి





**అక్షర కలం/**

రామంతపూర్ భగయత్ వెంకట సాయి నగర్ కాలనీ బీరప్ప దేవాలయం వెనకాల లైన్ లో సాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్ట్ ను అధికారులను తప్పుదోవ పట్టించి సాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్టు ను వెయ్యకుండా అడ్డుకుంటున్నారని ఈరోజు వెంకట సాయి నగర్ కాలనీవాసులు ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని కలిసారు . ఈ మేరకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎవరు అభివృద్ధిని అడ్డుకుంటే వారిపైనా న్యాయ పరమైన చర్యలు చేపడతామని అన్నారు . ఇప్పటికే రామంతపూర్ భగయత్ కాలనీలకు కోటి రూపాయలు మంజూరు చేయించి డ్రైనేజీ లైన్లు పూర్తి చేయించామని శాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్టు కూడా త్వరలో శంకుస్థాపన చేసి పనులను పూర్తి చేయిస్తాను అని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గంధం నాగేశ్వరరావు , కాలనీ వాసులు సర్వ సత్తయ్య యాదవ్, గోపాల్,ఆర్ .గోవింద్, ఏ విజయేందర్ రెడ్డి, శంకర్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, నవీన్, కీర్తి ,చారి, సయ్యద్, చారి , తదితరులు పాల్గొన్నారు.

# "కృష్ణవేణి అంటే " ఖమ్మంలో నెంబర్ వన్ కాలేజీ..

**ఇంటర్మీడియట్ ఎం పి సి, బై పి సి కి పెట్టింది పేరు.**




**- అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం: ఆశయం ఏదైనా సరే.. మంచి ప్రణాళిక బద్ధమైన కళాశాలలో చదివితే.. మన భవిష్యత్ బంగారు బాటల్లో నడుస్తుంది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు బంగారు భవిష్యత్ కోసమే అనుక్షణం పరితపిస్తుంటారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు విద్యార్థుల కలల సాకారం చేసుకోవాలంటే మంచి ప్లాట్ ఫామ్ ఉండాలి. అదే కృష్ణవేణి జూనియలో కాలేజీలే ఐఐటీ, చదివితే చదువే వస్తుంది.. అదే క్రమశిక్షణ ఉంటే అన్నీ వస్తాయి అన్న చందంగా మంచి ప్రణాళికలు సిద్ధం చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం పాటుపడే అద్భుతమైన వేదిక కృష్ణవేణి అనడంలో సందేహం లేదు. ఆచితూచి అడుగులు వేస్తూ మంచి ప్రణాలికను సిద్ధం చేసి పిల్లల బంగారు భవిష్యత్తు కోసం అన్నివిధాలా అద్భుతమైన ఆలోచనలో ఆచరణ చేసి మంచి విద్యను అందించే మహత్తర కళాశాల ఐఐటీ, ఈమేరకు అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ అద్భుతమైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్న ఖమ్మంలో ఆరంభమై 14 సంవత్సరాలు అయింది ఈమేరకు డైరెక్టర్లు యార్లగడ్డ వెంకటేశ్వరరావు (వై వి సార్) ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం అద్భుతమైన వేదిక కృష్ణవేణి జూనియర్ కాలేజీలు అకాడమీ అనడంలో అతిశయోక్తి లేదు. ఇంకే తల్లిదండ్రులు తమ పిల్లలు బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దటమే మా కృష్ణవేణి లక్ష్యం అన్నారు.

# తెలంగాణకు అవసరంపై మించి యూరియా పంపిణీ

**రైతులను మోసం చేస్తున్నది రాష్ట్రమే.**

**బీసీ రిజర్వేషన్ల పేరిట ముస్లింలకు ప్రయోజనం.**

**ఖమ్మాలో బీజేపీ పతాక ఎగురవేస్తోంది.**

**రైతు నమ్మకంగా ఉండండి కేంద్రం మీతో ఉంది.**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కేంద్రం అందిస్తున్న సహాయాన్ని తక్కువ చూపిస్తూ, ఎరువుల కొరతపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విమర్శలు పూర్తిగా అసత్యం, ఆధార రహితమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రాంచందర్ రావు ఖమ్మం పర్యటనలో స్పష్టం చేశారు. అవసరానికి మించి యూరియా, డీఏపీ సరఫరా చేసిన కేంద్ర ప్రభుత్వంపై, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఖమ్మం నగరంలో రోడ్ షో నిర్వహించిన ఆయన, సప్తపది ఫంక్షన్ హాల్లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల జీవితాలతో ఆడుకుంటోందని విమర్శలు గుప్పించారు. ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా, రాష్ట్ర రైతుల కోసం కేంద్రం చేస్తున్న యూరియా సరఫరా వివరాలు, బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ వైఖరిపై ఘాటుగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ, 2024%-%25 రబీ సీజన్ లో అవసరమైన 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు బదులుగా కేంద్రం 12.47 లక్షల మెట్రిక్ టన్నులు, అంటే 2.67 లక్షల టన్నులు అదనంగా పంపిందని వివరించారు. అంతేకాదు, డీఏపీ విషయంలో అవసరమైన 1.50 లక్షల మెట్రిక్ టన్నులకు బదులుగా 1.74 లక్షల మెట్రిక్ టన్నులు అందించబడినాయని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఖరీఫ్ సీజన్ (2025) (ఏప్రిల్%-%జూలై 22)లో, అవసరమైన 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు గాను ఇప్పటికే 6.12 లక్షల మెట్రిక్ టన్నులు పంపించబడగా, అందులో 4.36 లక్షల మెట్రిక్ టన్నులు అమ్మకాలు కాగా, 1.96 లక్షల మెట్రిక్ టన్నులు స్టాక్లో ఉన్నాయి. ఇదే సమయంలో డీఏపీ విషయంలో 1.85 లక్షల మెట్రిక్ టన్నులు పంపబడినట్లు వివరించారు. కేంద్రం చేసే సహాయం స్పష్టంగా ఉన్నా, ఎరువుల కొరతపై రాష్ట్ర ప్రభుత్వం చేసే ఆరోపణలు తప్పుడువని, అసలు లోపం రాష్ట్ర పంపిణీ వ్యవస్థలోనే ఉందని విమర్శించారు. బ్లాక్ మార్కెట్ అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వారు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీల లెక్కలు కూడా వివరించారు. యూరియా బస్తా ఖరీదు రూ.1690 కాగా, రైతు చెల్లించేది








కేవలం రూ.266.50 మాత్రమే. మిగతా రూ.1423.50 కేంద్రం భరిస్తుంది. డీఏపీ ధర రూ.2445.55 అయితే, రైతుకు గరిష్ఠ ధర రూ.1350 మాత్రమే అని వివరించారు. ఈ లెక్కలు తప్పని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని, లేకపోతే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజీనామా చేయాలని సవాల్ విసిరారు.

**బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కుట్ర.**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న మాటలు చెప్పిన కాంగ్రెస్, వాటిలో 10 శాతం ముస్లింలకు జోడించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. "ఇది బీసీ రిజర్వేషన్ బిల్లు కాదు %-% ముస్లింల రిజర్వేషన్ బిల్లు" అని అన్నారు. బిజెపి మాత్రం బీసీలకు పూర్తిగా మద్దతుగా ఉందని, రిజర్వేషన్ల బిల్లును బిజెపి భేషరతుగా మద్దతిచ్చిందని చెప్పారు.ఘనంగా ప్రచారం చేసిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పటికీ హామీలు అమలు చేయలేదని విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన 50 సీట్లలో 35 ముస్లింలు గెలిచారని, ఇది బీసీలకు జరిగిన అన్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ఖమ్మాలో బీజేపీ పతాకం ఎగురుతోంది.**

రాంచందర్ రావు ఖమ్మం బీజేపీ కార్యకర్తలకు ఉత్సాహం కలిగిస్తూ, ఈ జిల్లా ఇప్పటివరకు కమ్యూనిస్టుల గడ్డగా గుర్తింపు పొందినప్పటికీ, ప్రస్తుతం బీజేపీ ఆధిపత్యం స్థిరపడుతోందని ధీమా వ్యక్తం చేశారు. వెస్ట్ బెంగాల్లో కమ్యూనిస్టుల నుంచి బీజేపీలోకి వచ్చిన నాయకులు ఎంతో మంది ఉన్నట్టు చెప్పి, ఖమ్మం జిల్లాలోనూ అదే పరిస్థితి కనిపిస్తోందని వివరించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు తాండ్ర వినోద రావు, గేటేల విద్యాసాగర్, ఈవి రమేష్, కొండపల్లి శ్రీధర్ రెడ్డి, దేవకీ వాసుదేవరావు, సన్నీ ఉదయ ప్రతాప్, గల్లా సత్యనారాయణ, గోంగూర వెంకటేశ్వర్లు , కొల్లిపాక శ్రీదేవి, నున్న రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, విజయరాజు, రవి రాథోడ్, పుల్లారావు యాదవ్, అల్లిక అంజయ్య, దొంగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భూస్వామ్య విధానం రద్దు కావాలి , దున్నే వానికే భూమి కావాలి

**భారత విప్లవోద్యమ రథసారధులు , అమరులు సంస్మరణ సభలో వక్తలు**

**అక్షర కలం /ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం : భక్తరామదాసు కళాక్షేత్రంలో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం ( మార్క్సిస్టు - లెనినిస్టు ) యుసిసిఆర్ఎల్ ( ఎం.ఎల్ ) పార్టీ ఆధ్వర్యంలో భారత విప్లవ పంథా నిర్మాతలు అమరులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు , తరిమెల నాగిరెడ్డి మరియు శిష్టా విజయ్ శర్మ ల"సంస్మరణ సభ"ను యుసిసిఆర్ఎల్ ( ఎం.ఎల్ ) పార్టీ






నాయకులు కామ్రేడ్ కె.ఎర్రబాబు అధ్యక్షతన జరిగింది . ఈ "సంస్మరణ సభ"లో ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించి ఒక నిమిషం మౌనం పాటించారు . అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒపీడీర్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ డాక్టర్ జతిన్ కుమార్ పాల్గొని మాట్లాడారు . దేవులపల్లి వెంకటేశ్వరరావు బండమీది చందుపట్ల గ్రామంలో జన్మించి విద్యార్థి దశనుండే అభ్యుదయభావాలు ఆకట్టి కమ్యూనిస్టు పార్టీ ఆకర్షితులై సభ్యత్వం తీసుకున్నారని అన్నారు . బెనారస్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదివి వందేమాతరం ఉద్యమంలో పాల్గొని విప్లవానికి నాంది పలికి , ఆ నాటి తెలంగాణ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు , దేశముఖ్ గుండాల వెట్టి చాకిరి గురవుతున్న సామాన్య ప్రజలను సంఘటిత పరచి "తెలంగాణ ప్రజల సాయుధ పోరాటం"స్వయంగా నిర్వహించి పది లక్షల ఎకరాల భూములను పంచుకొని , మూడువేల గ్రామాలలో ఎర్రజెండాను ఎగురవేశారు . ఈనాడు భారతదేశంలో ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని , భూస్వామ్య విధానం రద్దు దున్నేవానికి భూమి .. సాధించడం కోసం వ్యవసాయక విప్లవం ద్వారానే ఉద్యమాలు ముందుకు కొనసాగుతాయని అని భారత విప్లవోద్యమ నిర్మాతలు కామ్రేడ్స్ డి.వి , టి.ఎన్ లు చూపిన జనతా ప్రజాతంత్ర విప్లవ బాటలో విప్లవోద్యమాన్ని నిర్మిస్తున్నాము . ఈ ప్రజా యుద్ధ పంథాలో ప్రజలందరూ పాల్గొని భారత విప్లవం కోసం కృషి చేయాలి అని పిలుపునిచ్చారు . ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒపీడీర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.విజయేందరావు మాట్లాడుతూ దేశంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని బారత పాలకవర్గాలు 78 సంవత్సరాలు స్వాతంత్ర్యం వచ్చి పూర్తికావస్తున్న భూమి సమస్యలపై పోరాడుతున్న ఖమ్మం , భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఏజెన్సీ ప్రాంతంలోనీ గిరిజనులపై నిర్బంధం కొనసాగిస్తుంది . అయిన తాము పోడుకొట్టిన భూములను సైతం సాధించే వరకు మా పోరాట%శీ% ఆగదు అని పోడు భూములపై గిరిజన , గిరిజనేతర పేదలు అందరిని ఐక్యతతో విప్లవోద్యమంగా ప్రజలను ముందుకు కదిలిస్తూ పోరాటాలు త్యాగ ఫలితమే భారత విప్లవ రథసారదులు కామ్రేడ్ డి వి , టి.యన్ లకు అందించే అసలైన నివాళి అని అన్నారు . కామ్రేడ్ విజయ్ శర్మ డి వి,టి యన్ రూపొందించిన లైన్ ను ఏకీభవించి పార్టీలోకి వచ్చి50 సంవత్సరాలు అయి 40 సంవత్సరాలు అజ్ఞాతంలో ఉండి , 10 సంవత్సరాలు ప్రజల మధ్య జీవనం సాగించిన గొప్ప విప్లవ త్యాగమూర్తి కామ్రేడ్ విజయ్ కు మనమ%శీ%దిస్తున్న అసలైన నివాళి అని అన్నారు . ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ పడిగ ఎర్రయ్య , గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గన్నెబోయిన వెంకటాద్రి , ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒపీడీర్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ దండా లింగయ్య , భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (మార్క్సిస్ట్ లెనినిస్టు ట యుసిసిఆర్ఎల్ ( ఎం.ఎల్ ) ఊ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ పోలెబోయిన ముత్తయ్య , ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒపీడీర్) జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బాణాల లక్ష్మణా చారి , గ్రామీణ పేదల సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కల్తి రామచంద్రయ్య మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు , ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు . ఈ"సంస్మరణ సభ"లో నవోదయ కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు .



అక్షరకలం
APTELRNI No. 2009/27246

# తాగిన మైకంలో పోలీసు అధికారుల విధులకు ఆటంకం పరుస్తూ, అర్ధరాత్రి ఆత్మహత్య యత్నం చేసుకున్న వ్యక్తి పై కేసు నమోదు

నల్లగొండ/ అక్షర కలం ప్రతినిధి :

నల్గొండ జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి సుమారు 11.00 గంటల సమయములో నల్గొండ పట్టణ నివాసి అయిన రావిళ్ల నర్సింహా తండ్రి తిరుపతయ్య, వ. 40 సం.లు, కులము కమ్మ అను అతడు త్రాగిన మత్తులో మోటార్ సైకిల్ నడుపుకుంటా వెల్లుచుండగా, రాత్రి విధులలో ఉన్న జె. సైదులు %హా×% గారు %ణఎఖ% రోడ్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా, నర్సింహా కు 155%ఎస్త్ర/100ఎశ్రీ% ఆల్కహాల్ రీడింగ్ వచ్చినది. అది దృష్టిలో పెట్టుకొని, సదరు రావిళ్ల నర్సింహా పోలీసువారి విధులను నిరోదించు (ఆటంక పరచాలనే) ఉద్దేశ్యముతో, తన శరీరముపై ఎక్కడో పెట్రోల్ పోసుకొని రాత్రి సుమారు 11.30 గంటలకు నల్గొండ 1 టౌన్ పోలీసు స్టేషన్ మెయిన్ గేట్ లో నుండి లోపలికి వస్తుండగా, అక్కడే పార్కింగ్ స్టలంలో ఉన్న హోంగార్డ్ ప్రవీణ్, ఎవరు నువ్వు, ఏమైంది, అని అడుగుతూ అతని దగ్గరికి వెళ్తుండగా, తన పైనే డ్రంకెన్ డ్రైవ్ కేసు వేస్తారా అంటూ, ముందుగానే తన వెంట తెచ్చుకున్న లైటర్ తో తనకి తాను కాల్చుకునేందుకు ప్రయత్నిస్తుండగా, అది గమనించిన ప్రవీణ్ ఆపడానికి వెళ్ళగా, కాల్చుకునే క్రమంలో ఒక్క సారిగా మంటలు చెలరేగడంతో, వెంటనే విధులలో ఉన్న అంజత్ కానిస్టేబుల్ బెడ్ షీట్ కప్పి మంటలు ఆర్పి, అక్కడ ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే అతని ప్రాణాలు కాపాడాలని, చికిత్స గురించి ఆసుపత్రి కి తరలించడము జరిగింది. ఈ క్రమంలో ప్రాణాలకి తెగించి అతనిని కాపాడటానికి ప్రయత్నించిన హోంగార్డ్ ప్రవీణ్ చేతులకి గాయాలయ్యాయి. ఇట్టి విషయములో పోలీస్ అధికారుల విధులని నిరోధిస్తూ, అర్ధరాత్రి తాగిన మైకంలో ఆత్మహత్య యత్నం చేసిన రావిళ్ల నర్సింహా పై కేసు నమోదు చేసి విచారణ జరుపుచున్నట్లు నల్గొండ 1 వ పట్టణ ఇన్స్ పెక్టర్ %ూా%. రాజ శేఖర్ రెడ్డి గారు తెలిపారు.

# నేలకొండపల్లి ఏఎంసీ యార్డులో రేషన్ కార్డుల పంపిణీ

## – ముఖ్యఅతిథిగా హాజరుకానున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

నేలకొండపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నేడు (బుధవారం) నేలకొండపల్లి మండలం ఏఎంసీ యార్డులో మధ్యాహ్నం 03గంటలకు నిర్వహించనున్నారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరుకానున్నారని ఆయన క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కావున మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రేషన్ కార్డు లబ్ధిదారులందరూ అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# స్నేహం అంటే ప్రాణం

## చిన్ననాటి మిత్రుని ఇంటికి డిప్యూటీ సీఎం



అక్షర కలం ఖమ్మం/ ప్రతినిధి:

స్నేహమంటే ప్రాణమిచ్చే మనిషి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అని మరోసారి రుజువయింది. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గ పర్యటన క్రమంలో యాలాల మండలం జుంటుపల్లి గ్రామంలోని డాక్టర్ రవీందర్ రెడ్డి కుటుంబంతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తన వెంట ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ అందరినీ కొద్దిసేపు పక్కన పెట్టి చిన్ననాటి మిత్రుని కుటుంబ సభ్యులందరితో ప్రశాంతంగా గడిపారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు పేరుపేరునా ఆరా తీశారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగినప్పటికీ చిన్ననాటి బంధాన్ని గుర్తుచేసుకొని మరి ఇంటికి రావడమే కాదు ప్రజా ప్రతినిధులు అందరినీ పక్కనపెట్టి ప్రత్యేకంగా సమయం కేటాయించి యోగక్షేమాలు ఆరా తీయడం తో డాక్టర్ రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యుల కళ్లలో ఆనంద భాష్పాలు కనిపించాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రవీందర్ రెడ్డి ఇంట్లోని ప్రతి గదిని పరిశీలించి చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.డాక్టర్ రవీందర్ రెడ్డి కుటుంబం అధ్వర్యంలో కొనసాగుతున్న స్థానిక సీతారామచంద్రస్వామి దేవాలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులు డిప్యూటీ సీఎం వివరించగా ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# పోగొట్టుకున్న 28 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత

## ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 2360మొబైల్ ఫోన్లను రికవరీ

## వివరాలు వెల్లడించిన అడిషనల్ డీసీపీ లా ఆర్డర్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి/







పోగొట్టుకున్న28 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు అడిషనల్ డీసీపీ లా%ఆ%ర్డర్ ప్రసాద్ రావు తెలిపారు.పోగొట్టుకున్న/చోరీకి గురైన మొబైల్ ఫోన్ ను బాధితులు %జుజు×=% పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో మొబైల్ ఫోన్ ట్రాక్ చేసిన ఐటీ సెల్ బృందం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనలతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో యజమానులకు అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా అప్పగించారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ...సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ విధానంతో సుమారు ఎనిమిది లక్షల విలువ గల 28 ఫోన్లను ట్రేస్ చేసి, నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు.ఒక్కొక్క మొబైల్ ఫోన్ యాబై వేల నుండి 10 వేల రూపాయలు ఖరీదు గల ఫోన్లను ట్రాక్ చేయడం జరిగిందన్నారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే మొబైల్ ఫోన్స్7121 పోగొట్టుకున్నట్లు %జుజు×=% పోర్టల్ ఫిర్యాదులు నమోదు కాగా 2360 ఫోన్స్ ట్రాక్ ను గుర్తించి మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు.ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న...నగదు లావాదేవీలు చేయాలన్న మొబైల్ ఫోన్ పైనే ఆదారపడేంతగా ప్రాదాన్యం సంతరించుకుందని అన్నారు. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న /చోరీకి గురైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవవసరం కష్టమేనని అన్నారు. పోయిన ఫోన్ లను వెతికి పెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందన్నారు. సెల్ ఫోన్ల రికవరీ లో కీలకంగా వ్యవహరించిన ఐటి సెల్ ఎస్సై సత్యనారాయణ, టెక్నికల్ బృందాన్ని ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అభినందించారు.

# నిండుకుండలా నాగార్జునసాగర్ డ్యాం...

## 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల...

## నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ....

## నాగార్జునసాగర్ ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారిగా 18 సంవత్సరాల తర్వాత జూలై నెలలోనే సాగునీటి విడుదల...

## నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం..







## రాష్ట్రంలోని ప్రాజెక్టులను ఆధునికరిస్తాము. పూడిక తీస్తాం-రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

అక్షర కలం

నాగార్జున సాగర్ లో మంగళవారం నాడు ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.అనంతరం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల లోని 22 లక్షల ఎకరాలకు సాగునీరునందుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు.సాగునీటితో పాటు నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30,000 క్యూసెక్కుల నీటి తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. అనంతరం మంత్రులు,అధికారులు కలసి నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు సారే అందించి ,పుష్పాభిషేకం చేశారు.నాగార్జున సాగర్ ప్రాజక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ కు వదిలిన తర్వాత ప్రాజెక్ట్ అధికారులు 26 గేట్ల 5 ఫీట్లు మేర ఎత్తి 2,04,048,క్యూసెక్కుల నీటి దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, మాజీ జడ్పీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి ,హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి , నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పెద్దల సమక్షంలో రాష్ట్ర తెలుగుదేశం నేత తోటకూరి శివయ్య కాంగ్రెస్ పార్టీలో చేరిక

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:





కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర నాయకులు తోటకూరి శివయ్య రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నట రాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరావు సమక్షంలో మంగళవారం కాం గ్రెస్ పార్టీలో చేరారు.కామేపల్లి సొసైటీ వైస్ చైర్మన్ గుజ్జర్ల పూడి రాంబాబు,జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫతే మహ మ్మద్,ఏపూరి మహేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955